



టెక్సానా మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేశ్

మార్పు ఇంటి నుంచే రావాలి

● కొప్పర్తిలో లక్ష ఉద్యోగాలు కల్పిస్తాం ● ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్

● కొప్పర్తిలో రెండు పరిశ్రమలు..

● సీకేదిన్నెలో స్మార్ట్‌కిచెన్ ప్రారంభం

సీకేదిన్నె, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మార్పు అనేది ఎక్కడో రాదని, మన ఇంటి నుంచే రావాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం కొప్పర్తి ఎలక్ట్రానిక్ మ్యానిఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో నూతనంగా ఏర్పాటైన ఎగ్జిక్యూటివ్ సెంటర్ భవనం, ఎంఎస్ టెక్నోడోమ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ హబ్‌లోని టెక్సానా వరల్డ్ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమలను మంగళవారం మంత్రి లోకేశ్, ఇన్‌చార్జి మంత్రి సవిత, స్థానిక ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మార్పు అనేది మన ఇంటిలో నుంచి రావాలని అన్నారు. మహిళలను గౌరవించడం అనే పద్ధతి మన కుటుంబం నుంచి ప్రారంభమై గ్రామం, మండలం, జిల్లా, రాష్ట్రం, దేశవ్యాప్తంగా విస్తరించాలన్నారు. మహిళలకు పురుషులతో సమాన ప్రాతినిధ్యం అందించేది ఎన్డీయే అన్నారు. కొప్పర్తిలో లక్ష మందికి ఉద్యోగాలు కల్పించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. మహిళలు సొంత కాళ్లపై నిలబడాలనే ప్రభుత్వ లక్ష్యమని అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ప్రభుత్వం చేస్తుందన్నారు. మహిళలకు ఏ సమస్య ఉన్నా ఒక మెసేజ్ పంపితే పరిష్కరిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా మహిళలతో సెల్ఫీలు దిగారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేసీ అదితిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలోనే తొలి స్మార్ట్ కిచెన్

విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారాన్ని అందించాలన్న లక్ష్యంతో దేశంలోనే తొలిసారిగా సీకేదిన్నె ప్రభుత్వ పాఠశాలలో స్మార్ట్‌కిచెన్ ఏర్పాటు చేశామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఇక్కడ విజయవంతం అయితే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.2 కోట్లతో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ స్మార్ట్‌కిచెన్‌ను మంగళవారం మంత్రి ప్రారంభించారు. జమ్మలమడుగు మండలంలో రెండు, కడపలో ఒక స్మార్ట్ కిచెన్‌ను మంత్రి లోకేశ్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఆర్వోప్లాంటు, ఆహారపంపిణీ వాహనాలను కూడా మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం శుచితో కూడిన భోజనాన్ని విద్యార్థులకు సమయానికి అందించడం జరుగుతుందన్నారు. అనంతరం మంత్రి లోకేశ్ పాఠశాల 10వ తరగతి విద్యార్థినులతో బేటీ అయ్యారు. గత సంవత్సరం నుండి ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గంగిరెడ్డి గణేశ్ రెడ్డి అనే 10వ తరగతి విద్యార్థి తొమ్మిది నోట్‌బుక్కులు పరిశీలించిన లోకేశ్ చేతిరాత చాలా బాగుందని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మంత్రి సవిత, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, ఎమ్మెల్యే కృష్ణచైతన్య రెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌కిచెన్‌లో భోజనం రుచి చూస్తూ...





వైవీయూలో రూ.20 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న మంత్రి నారా లోకేశ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, పుత్తా నరసింహారెడ్డి తదితరులు



స్మార్ట్ కిచెన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి నారా లోకేశ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మాధవి, కృష్ణచైతన్యరెడ్డి, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, పుత్తా నరసింహారెడ్డి



డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గదిలో..



దివ్యాంగుడిని ఆప్యాయంగా పలకరిస్తూ..

కార్యకర్తలకు అండగా ఉంటా : మంత్రి

కార్యకర్తలకు అండగా ఉంటామని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి కొలుములపల్లెలో 69వ ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్‌ను కలిసేందుకు పెద్ద ఎత్తున ప్రజలు, పార్టీ కార్యకర్తలు తరలి వచ్చారు. వారి నుంచి వినతులు స్వీకరించారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించి వారితో ఫొటోలు దిగారు. దాదాపు నాలుగు గంటలకుపైగా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఏడు గంటల తర్వాత మంత్రి లోకేశ్ బయల్దేరి విమానాశ్రయం చేరుకుని 7.40 గంటలకు విమానంలో గన్నవరం బయలుదేరారు. మంత్రికి వీడ్కోలు పలికిన వారిలో రాష్ట్ర రవాణా శాఖ యువజన క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ అశోక్‌కుమార్, కడప, కమలాపురం ఎమ్మెల్యేలు మాధవి, కృష్ణచైతన్యరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, కడప, జమ్మలమడుగు ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, జమ్మలమడుగు ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తూ...

స్వేచ్ఛగా ఎన్నిక జరిగితే పులివెందులలో టీడీపీదే విజయం..

● వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొడతాం : నారా లోకేశ్

కడప, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో స్వేచ్ఛగా ఎన్నిక జరిగితే జగన్ గెలిచే పరిస్థితే ఉండదని టీడీపీ గెలుస్తుందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. మంగళవారం కడపనగర శివారులోని సీకేదిన్నె మండలంలో కమలాపురం నియోజకవర్గ కార్యకర్తల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో కార్యకర్తలు పడ్డ ఇబ్బందులు తాను చూశానన్నారు. ఇవన్నీ చూసిన తర్వాతనే సూపర్ సిక్స్ నిర్ణయించి ఎత్తిన పసుపుజెండా దించకుండా అధికారం అందుకునే వరకు పనిచేశామన్నారు. టీడీపీకి హార్డ్‌కోర్ ఫ్యాన్స్‌ఉన్నారన్నారు.

డైరెక్ట్ కాంటాక్ట్ టీడీపీ కార్యకర్తల ద్వారానే

తనకు డైరెక్ట్ కాంటాక్ట్ టీడీపీ కార్యకర్తలతోనే అన్నారు. ఎన్ని పనులున్నా కార్యకర్తలతో సమావేశం అవుతున్నానన్నారు. కడప జిల్లాలో అత్యధికసీట్లను గెలిపించారని, దీని వెనుక కార్యకర్తల శ్రమ ఉందని అన్నారు. పులివెందుల ఎమ్మెల్యేకు దిమ్మదిరిగే దెబ్బకొట్టారన్నారు. అహంకారానికి వ్యతిరేకమని ప్రజలు నిరూపించారని తెలిపారు. కడపలో మాధవి, కమలాపురంలో చైతన్యరెడ్డి బాగా కష్టపడ్డారని, వారిని గెలిపించారన్నారు. పులివెందులలో స్వేచ్ఛగా ఓటింగ్ జరిగితే జగన్ గెలవరని పేర్కొన్నారు. అందుకే టీడీపీ ప్రజాప్రతినిధులు జనంలో ఉండడం మొదలుకావాలని, ప్రజల సమస్యలు తెలుసుకోవాలని అన్నారు. టీడీపీలో అలకలు వీడాలని, ఏదైన కూర్చొని మాట్లాడుకోవాలని చెప్పారు. జగన్ హయాంలో చంద్రబాబునాయుడు బయటకు రావాలంటే గేట్లకు తాళం వేశారని అడ్డుకున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు పులివెందులలో స్వేచ్ఛగా ఓటింగ్ జరిగితే వైసీపీకి డిపాజిట్ కూడా రాదన్నారు. వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టే బాధ్యత టీడీపీ కార్యకర్తలపైనే ఉందన్నారు.



లోకేశ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న పుత్తా చైతన్యరెడ్డి, నరసింహారెడ్డి


విద్యాపరంగా నాణ్యత పెంచడానికి ఏం చేయాలి

● డిగ్రీ కళాశాల విద్యార్థుల సూచనలు కోరిన మంత్రి ● ఆదర్శ డిగ్రీ కళాశాలను ప్రారంభించిన నారా లోకేశ్

పెండ్లిమర్రి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెర్లోపల్లె పంచాయతీలో రూ.12కోట్లతో నిర్మించిన అధునాతన ఆదర్శ డిగ్రీ కళశాల భవనాలను రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ మంగళవారం ప్రారంభించారు. పీఎం ఉష పథకంలో భాగంగా యోగివేమన యూనివర్శిటీకి సంబంధించి డిగ్రీ కళాశాల లోపల రూ.20 కోట్లతో నిర్మించనున్న ఆడిటోరియం, నూతన పరిపాలన భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి లోకేశ్ బీఏ ఎకనమిక్స్ ద్వితీయ సంవత్సరం తరగతి గది పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భావి భారత పౌరులను తయారు చేయడంలో విద్యాశాఖ కీలకమైనదన్నారు. కష్టమైనదైనా భావిభారత పౌరులను తయారుచేసే విద్యా శాఖను కోరి తీసుకున్నా అన్నారు. విద్యాపరంగా నాణ్యత పెంచడానికి మంత్రిగా తాను ఏంచేయాలో చెప్పాల్సిందిగా సూచనలు అడిగారు. విద్యార్థులు స్పందిస్తూ ఫ్యాకల్టీ పెంచాలని కోరారు. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. కళాశాల సమీపంలో బస్టాప్ ఏర్పాటు చేయాలని, కాంపౌండ్ వాల్ నిర్మించాలని విద్యార్థులు తెలిపారు. కళాశాలల్లో మౌలిక సదుపాయల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి అన్నారు. ఉచిత బస్సు సౌకర్యం తమకు చాలా ఉపయోగకరంగా ఉందని విద్యార్థినులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్ చార్జి మంత్రి సవిత, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, ఆర్టేడీ నాగలింగారెడ్డి, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, వైవీయూ వీసీ అల్లం శ్రీనివాసరావు, విద్య మౌలిక సదుపాయాల కార్పొరేషన్ చైర్మన్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. కాగా.. పెండ్లిమర్రి మండలంలో ఆదర్శ డిగ్రీ కళాశాలను ప్రారంభించేందుకు వచ్చిన మంత్రి నారా లోకేశ్‌కు మంగళవారం మండల ప్రజలు అడగడుగునా ఘనస్వాగతం పలికారు. టీడీపీ నేతలు కిషోర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో 500 స్కూటర్లతో నందిమండలం నుంచి వెల్లటూరు దాకా భారీ ర్యాలీ నిర్వహించారు. కాగా.. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు డ్వామా ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందచేసారు. డ్వామా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ మునిశేఖర్ రాజు ఉద్యోగులతో కలసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన నారా లోకేశ్ సంబంధిత మంత్రితో మాట్లాడి త్వరగా మీ సమస్యలను తీరుస్తానని తెలిపారు.

పెండ్లిమర్రి మండలంలో ఆదర్శ డిగ్రీ కళాశాలను ప్రారంభించిన అనంతరం విద్యార్థులతో మాట్లాడుతున్న నారా లోకేశ్





నేతలు చెప్పితే.. చేసేస్తారంతే!

● రాజుపాళెంలో విద్యాధికారుల బాగోతం

● న్యాయం చేయాలని కలెక్టర్‌కు బాధితురాలి ఫిర్యాదు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో నేతల వ్యవహారం వైసీపీ పాలన కంటే అధ్వాన్నంగా సాగుతోంది. తమవారైతే చాలు.. అన్యాయమైనా వారి కోరింది చేయాల్సిందే. ఈ మేరకు అధికారులపై అధికారపార్టీ నేతలు ఒత్తిడి పెంచుతున్నారు. దీంతో అధికారులు మనస్సాక్షిని చంపుకుని తప్పుడు నివేదికలు ఇచ్చి అర్హులకు అన్యాయం చేస్తున్నారు. వివరాలిలా..

రాజుపాళెం మండలం జడ్పీ హైస్కూలు కాంప్లెక్సులో ఎం.రాజేశ్వరి 2019 నుంచి క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌గా పనిచేస్తున్నారు. విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో ఇదే మండలంలోని అరకటవేముల స్కూలు కాంప్లెక్స్‌ను విద్యాశాఖ అధికారులు క్లోజ్ చేసి రాజుపాళెం జడ్పీ హైస్కూల్లో విలీనం చేశారు. దీంతో అక్కడ పనిచేస్తున్న సీఆర్పీ కె.భార్గవిలతను రాజుపాళెం స్కూలు కాంప్లెక్స్‌లోనే బి కాంప్లెక్స్‌కు పనిచేయాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. రిటైర్డ్ అధ్యాపకుడైన ఈమె తండ్రి అధికార పార్టీ నాయకుడు కూడా. నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకుడితో ఎంఈవోపై ఒత్తిడి తెచ్చి భార్గవిలతను రాజుపాళెం జడ్పీ హైస్కూలు కాంప్లెక్స్-ఏకు సీఆర్పీగా నియమించేలా ఉత్తర్వులు వచ్చేలా చేశారు. కాగా రాజేశ్వరి ప్రొద్దుటూరు మండలంలో 6 ఏళ్లకు పైబడి పనిచేశారు. ప్రొద్దుటూరు సర్వీసును పరిగణనలోకి తీసుకోకుండా కేవలం అరకటవేముల సీనియారిటీని మాత్రమే లెక్కవేసి రాజేశ్వరిని జూనియర్‌గా పరిగణించి రాజుపాళెం ఏ కాంప్లెక్స్‌కు భార్గవిలతను నియమించారు. ఏ కాంప్లెక్స్‌కు అప్పటికే సీఆర్పీగా ఉన్న రాజేశ్వరిని బి కాంప్లెక్స్‌ను కేటాయించారు. దీంతో బాధితురాలు రాజేశ్వరి ఆగస్టు 25వ తేదీన కలెక్టర్‌కు పీజీఆర్ఎస్ గ్రీవెన్సులో ఫిర్యాదు చేశారు.

దీనిపై రాజుపాళెం ఎంఈవో-2 రామస్వామి రెడ్డిని వివరణ కోరగా డీఈవో, ఎస్ఎస్ఏ ఏపీసీ వారి మౌఖిక ఆదేశాసారం మండల సీనియారిటీ ప్రకారం భార్గవిలతను రాజుపాళెం స్కూలు కాంప్లెక్స్ ఏ కు, రాజేశ్వరిని కాంప్లెక్స్ బి కి ప్రతిపాదించామని అన్నారు. ఎస్ఎస్ఏ జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ నిత్యానందరాజును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా పరిపాలన సౌలభ్యంకోసం ఎంఈవో-2 ఇచ్చిన నివేదిక ప్రకారం రాజుపాళెం కాంప్లెక్స్‌లకు తాత్కాలికంగా సీఆర్పీలను సర్దుబాటు చేశామన్నారు. జిల్లాలో 180 స్కూలు కాంప్లెక్స్‌లు ఉంటే వాటిని 120కి కుదించామన్నారు. బి కాంప్లెక్స్‌లకు సీఆర్పీలుగా ఉన్న వారిని ఏవిధంగా వినియోగించుకోవాలనే గైడ్‌లైన్స్ ఇంకా రూపొందలేదన్నారు. అయితే ఎవరి ఉద్యోగాలకు ఇబ్బంది ఉండదన్నారు.



కలెక్టర్‌కు బాధితురాలు రాజేశ్వరి పెట్టుకున్న పీజీఆర్ఎస్ ఫిర్యాదు


బార్ నిర్వహణకు లాటరీ

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్ ఎక్సైజ్ రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం కలెక్టర్ చాంబరులో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సమక్షంలో ఒక బార్‌కు లాటరీ నిర్వహించారు. కడపలో రీనోటిఫై చేసిన బార్లలో 01 బార్‌కు లాటరీ నిర్వహించి విశ్వనాథరెడ్డి అనే వ్యక్తికి కేటాయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి కృష్ణకుమార్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చర్లపల్లె-తిరుపతి మధ్య ప్రత్యేక వీక్లీ రైలు

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లె -తిరుప తి-చర్లపల్లెకు కడప మీదుగా ప్రత్యేక వీక్లీ రైలు (నెంబర్ 07013/07014) నడవనున్నట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎ.జనార్దన్ తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుంచి నవంబర్ 25వ తేదీ వరకు ప్రతి మంగళవారం చర్లపల్లెలో రాత్రి 9.25గంటలకు రైలు బయలుదేరుతుందన్నారు. నంద్యాల మీదుగా జమ్మలమడుగుకు మరుసటి రోజు ఉదయం 7.15గంటలకు, ఎర్రగుంట్ల 7.58, కడప 8.48గంటలకు చేరుకుంటుంది. రాజంపేట 9.36, కోడూరు 10.13, రేణిగుంట 11.33, తిరుపతి 12.30గంటలకు చేరుకుంటుంది. ఈ రైలు తిరుగు ప్రయాణంలో సెప్టెంబర్ 10వ తేదీ నుంచి నవంబరు 26వ తేదీ వరకు తిరుపతిలో ప్రతి బుధవారం సాయంత్రం 4.40గంటలకు బయలుదేరి రేణిగుంట మీదుగా అదే రోజు కోడూరుకు సాయంత్రం 5.33గంటలకు, రాజంపేట 6.03, కడపకు 7.18గంటలకు చేరుకుంటుంది. ఎర్రగుంట్ల 7.48గంటలకు, ప్రొద్దుటూరుకు 8.03, జమ్మలమడుగు 8.34 చేరుకొని నంద్యాల మీదుగా మరుసటి రోజు ఉదయం 8గంటలకు చర్లపల్లె చేరుకుంటుంది. ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు ఈ ప్రత్యేక వీక్లీ రైలును వేసినట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుండెపోటుతో భక్తుడి మృతి



నరసింహారావు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తీశ్వరుడి దర్శనార్థం విచ్చేసిన భక్తుడు గుండెపోటుతో మృతి చెందాడు. కడప నగరానికి చెందిన నరసింహారావు(60) కుటుంబసమేతంగా ముక్కంటిని దర్శించుకునేందుకు మంగళవారం రాత్రి శ్రీకాళహస్తీశ్వరాలయం చేరుకున్నారు. ఆలయ నాలుగో ప్రవేశ మార్గం వద్ద ఉన్న సీఆర్వో కేంద్రానికి అద్దెగది కోసం కుటుంబ సభ్యులు వెళ్లారు. ఆ సమయంలో సీఆర్వో కార్యాలయం వెలుపల నిలబడి ఉన్న నరసింహారావు ఉన్నట్టుండి కుప్పకూలిపోయాడు. ఆలయ నైవేద్యం తయారీ పోటులో పనిచేసే అర్చకుడు అంబులెన్సులో చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

బిజీబిజీగా జగన్

● గంగమ్మకుంటకు జలహారతి

పులివెందుల / లింగాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బిజీబిజీగా గడిపారు. మంగళవారం ఉదయం 8గంటల ప్రాంతంలో వైఎస్సార్ ఘాట్‌కు చేరుకుని తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా తల్లి విజయలక్ష్మి, సతీమణి భారతితో కలిసి నివాళులు అర్పించారు. అనంతరం రోడ్డుమార్గాన లింగాల మండలంలోని అంబకపల్లె గ్రామంలో గంగమ్మకుంటకు జలహారతి ఇచ్చేందుకు బయలుదేరారు. వీరన్నగట్టుపల్లె, వేంపల్లె బైపాస్ మీదుగా కాన్వాయ్ సాగింది. తాళ్లపల్లె వద్ద ఉల్లిపంటను ఆయన పరిశీలించారు. అనంతరం వేముల మండలంలోని వేముల, వేల్పుల తదితర గ్రామాల వద్ద ఆయన ప్రజలకు అభివాదం చేస్తూ సెల్ఫీలు దిగారు. నల్లపురెడ్డిపల్లె శివారు నుంచి ప్రధాన రహదారి గుండా ఆయన వాహనం దిగి ప్రజలకు అభివాదంచేస్తూ కాలినడకన గ్రామం చివరి వరకు నడుచుకుంటూ సాగారు. అంబకపల్లెకు చేరుకుని నూతనంగా నిర్మించిన గంగమ్మకుంటలో కృష్ణాజలాలు నింపిన సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డితో కలిసి జలహారతి ఇచ్చారు. అనంతరం ఆయన పులివెందుల క్యాంప్ కార్యాలయానికి చేరుకుని సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ప్రజాదర్బార్ నిర్వహించారు.



గంగమ్మకుంటకు చేరిన కృష్ణా జలాల వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్ జగన్

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందని జగన్ పేర్కొన్నారు. ఇడుపులపాయలో వైఎస్‌కు నివాళులు అర్పించిన అనంతరం వేంపల్లె మండలంలోని తాళ్లపల్లెలోని ఉల్లిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ వైసీపీ హయాంలో ఉల్లి క్వింటాల్ రూ.2వేలతో కొనుగోలు చేశామని ఆ ప్రకారం కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చీనీ రైతుకు మినిమం టన్ను రూ.30వేలు ధర ఉండేలా చూడాలని కోరారు. అరటి రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. యూరియా బ్లాక్‌మార్కెట్‌కు తరలిపోతోందని, రైతులకు అందడం లేదని కూటమి పాలకుల కమీషన్ల కక్కుర్తి వల్ల ఈ పరిస్థితి వచ్చిందన్నారు. కాగా.. లింగాల మండలం అంబకపల్లెలో జగన్ పర్యటనలో పాల్గొనేందుకు వస్తూ గుణకనపల్లె గ్రామానికి చెందిన దాసరి కుళాయప్ప, పులివెందులకు చెందిన ఖాదర్‌వల్లి ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డంతో గాయపడ్డారు. వీరికి అంబకపల్లెలో లింగాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరంలో వారికి డాక్టర్ ప్రసన్నకుమార్ చికిత్స అందించారు.

వెంకన్న పవిత్రోత్సవాలకు అంకురార్పణ


పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కోసువారిపల్లెలో వెలసిన ప్రసన్న వేంకటరమణ స్వామి పవిత్రోత్సవాలకు మంగళవారం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. టీటీడీ ఆధ్వర్యంలో 2 నుంచి 5వ తేది వరకు ప్రసన్న వేంకటరమణస్వామి పవిత్రోత్సవాలను నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశంత్ కుమార్ ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణ స్వామి ఉత్సవమూర్తులను ముఖ మండపంలో ఉంచి వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి టీటీడీ ఆగమ సలహాదారు మణికంఠ భట్టర్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణ ప్రసాద్, ఉప అర్చకులు రమేష్‌బాబు స్వామి శ్రీవారికి భగవతారాధన నిర్వహించి అనంతరం పవిత్రోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. బుధవారం ఉదయం చతుష్టానార్చనం, పవిత్ర ప్రతిష్ఠ, పూర్ణాహుతి, స్నపన తిరుమంజనం, సాయంత్రం చతుష్టానార్చన హోమం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది నగేష్, భక్తులు పాల్గొన్నారు.

రోప్ స్కిప్పింగ్‌లో రాష్ట్ర స్థాయి ప్రతిభ


రోప్ స్కిప్పింగ్‌లో ప్రతిభ చాటిన మదనపల్లె విద్యార్థులు


మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రోప్ స్కిప్పింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో మదనపల్లె విద్యార్థులు ప్రతిభ చూపారు. నంద్యాల జిల్లా డోన్‌లో ఆగస్టు 31న నిర్వహించిన 8వ రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో ద్వితీయ, తృతీయ స్థానం సాధించారు. మదనపల్లె పట్టణం, నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్.తేజేశ్వర్ (డబుల్ అండర్ ద్వితీయ), శిరీష్‌కుమార్ (హెచ్‌వోపీ ద్వితీయ), స్పీడ్ స్ప్రింట్‌లో తృతీయ స్థానంలో గెలుపొందారు. వీరిని పీడీ లత, హెచ్ఎం శ్రీనప్ప అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్, శ్రీకుమార్, శ్రీబాబు, పద్మజ, ముధుమతి, లలితకుమారి, మాధవి, పాల్గొన్నారు.

పింఛన్ సొమ్ము రికవరీ


ఎంపీడీఓకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న దృశ్యం

కురబలకోట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ప్రతి నెలా ప్రభుత్వం పంపిణీ చేసే ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ సొమ్మును పూర్తిగా రికవరీ చేసినట్లు ఎంపీడీఓ గంగయ్య తెలిపారు. ఎంపీడీఓ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అంగళ్లు పంచాయతీ జోగివారిపల్లెకు చెందిన వెంకటరమణ తెట్టు సచివాలయంలో జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. తెట్టు పంచాయతీ పరిధి హరిజనవాడలో లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన సొమ్మును ఇవ్వకుండానే పరారైన విషయం తెలిసిందే. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రామప్ప ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్‌కు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కాగా ఉద్యోగి తండ్రి శ్రీనివాసులు సోమవారం రూ.3లక్షలు ఎంపీడీఓకు అందజేయగా, మిగిలిన సొమ్మును మంగళవారం అందజేశారు. దీంతో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

కుదువకు పేదల గూడు



- చెరబడుతున్న ప్రైవేటు ఫైనాన్స్‌లు
- అప్పులు తీర్చుకోవడం కోసం వడ్డీల ఊబిలోకి..
- చాపకింద నీరులా పల్లెలకు పాకుతున్న జాడ్యం

బి.కొత్తకోట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అవును.. తలదాచుకునేందుకు కట్టుకున్న గూడు... ఆత్మాభిమానానికి, సమాజంలో మదింపునకు తార్కాణంగా నిలిచే నివాసం.. ఆస్తిపై రుణం ముసుగులో కుదువకు వెళుతోంది. అప్పులు తీర్చుకోవచ్చనే ఆశతో కార్మికులు, రైతులు ఆత్మాభిమానాన్ని ప్రైవేటు ఫైనాన్స్ బ్యాంకులకు తాకట్టుపెడుతున్నారు. కుటుంబానికి ఆర్థిక సమస్యలు వచ్చినపుడు అప్పులు చేస్తారు. ఇంట్లోని బంగారు కుదువకు పెడతారు. ఇంకా అంటే పరువు పోకుండా భూములు మార్టిగేజ్(చూపుడాయకం)చేసి అప్పు తీసుకుంటారు. ఇది అంతకంటే ఘోరం... పెళ్లాం పిల్లలతో కలిసి ఉంటున్న ఇంటినే ఆయకం పెట్టే క్రమంలో ఫైనాన్స్ సిబ్బంది చేష్టలతో జరిగే అవమానం ఒక ఎత్తు అయితే, నెలవారీ కంతులు కట్టలేని పరిస్థితిలో వాళ్ల చేసే అవమానకర పనులతో రుణదాతలు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి దాపురిస్తోంది. మదనపల్లె, బి.కొత్తకోట కేంద్రాలుగా పనిచేస్తున్న ఈ ప్రైవేటు బ్యాంకుల ఉచ్చులో వేల కుటుంబాలు చిక్కుకొని విలవిలలాడుతున్నాయి.

చిన్నచిన్న అప్పులు తీర్చడం కోసం.. పెద్దఅప్పు


బి.కొత్తకోట, పీటీఎం, ములకలచెరువు మండలాలతో పాటు సత్యసాయి జిల్లా తనకల్లు మండలంలో సైతం ప్రతి పల్లెలో పదులసంఖ్యలో కుటుంబాలు తమ ఇళ్లను తాకట్టుపెట్టి ఒక్కొక్కరు రూ.4లక్షల నుంచి రూ.7 లక్షల వరకు రుణాలు తీసుకున్నారు.


బి.కొత్తకోట మండలంలో ఓ ఇంటి ముందు రాసిన నోటీసు

అప్పులలో కూరుకుపోయి బాధలు పడుతున్న వారికి ఈ ఫైనాన్స్ బ్యాంకులు ఊరిస్తున్నాయి. ఒకరిని చూసి మరొకరు వీటిపట్ల ఆకర్షితులవుతూ ఇళ్లను తాకట్టుపెట్టి డబ్బు తీసుకుంటున్నారు. ఉదాహరణకు వెంకట్రమణ టైలర్ పని చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇంటిపని చేయడానికి, కొడుకు చదువుకు అప్పులు చేశాడు, డైలీ, వీక్లీ కలెక్షన్లకు తీసుకున్నాడు. ఈ కలెక్షన్లు, వడ్డీలు, చీటీలు కట్టలేక దిక్కుతోచని స్థితిలో తాను కొత్తగా నిర్మించిన ఇంటిని ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌కు కుదవపెట్టి రూ.7.60లక్షలు తీసుకున్నాడు. అంతా అప్పులకే సరిపోయింది. తీరా ఆ ఫైనాన్స్ వడ్డీరేటు చూస్తే దిమ్మతిరిగింది. నెలవారీ కంతులు ఏకంగా ఎనిమిది సంవత్సరాలు చెల్లిస్తేకానీ అప్పు తీరదు.

రిజిస్ట్రేషన్ అవుతుందనే ఆశతో..

గ్రామాలలో చాలామందికి తాము ఉంటున్న ఇళ్లకు ఎటువంటి పట్టా, రిజిస్ట్రేషన్ ఉండదు. చాలావరకు గ్రామకంఠం వుంటుంది. అలాంటి వారికి వీరు గాలం వేస్తారు. వీఆర్వో దగ్గర సంతకం పెట్టిస్తే భార్యకు గిఫ్ట్‌డీడ్‌గా రిజిస్ట్రేషన్ చేయించి, భార్య దగ్గర నుంచి ఫైనాన్స్ కంపెనీ పేరిట మార్టిగేజ్ చేసుకుంటారు. ఇందుకయ్యే ఖర్చంతా కుటుంబీకులే భరించాలి. అప్పూ దొరుకుతుంది, ఇల్లు రిజిస్టర్ అవుతుందన్న ఆశతో పేదలు వీరి బుట్టలో పడి, రుణాలు తీసుకొని అధిక వడ్డీలతో ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు.


వీఆర్వో రాసిచ్చిన సర్టిఫికెట్

రుణాల వసూళ్లు మరీ ఘోరం

ఈ ఫైనాన్స్‌ల వద్ద అప్పులు తీసుకున్న వారికి టార్చర్ మామూలుగా వుండదు. నిత్యం ఫోన్‌లో వేధింపులు. ఒక్క నెల కట్టకపోయినా చక్రవడ్డీ పడుతుంది. మూడు నెలలు కట్టకపోతే లాయర్ నోటీసు వస్తుంది. ఇంటిపై అప్పు ఉన్నట్లు ఇంటి ముందు గోడకు బోర్డు రాస్తారు. అప్పటికీ కట్టకపోతే కోర్టు, పోలీసుల ద్వారా ఇంటిని సీజ్ చేయిస్తారు. ఊరిలో చాటింపు వేయించి మరీ రుణగ్రస్తుడి ఇంటిని జప్తు చేసి వేలం వేస్తారు. కార్మికులు, సన్నకారు రైతులకు రెగ్యులర్‌గా ఆదాయం ఉండదు. దీంతో వాయిదా పైకం చెల్లించలేక సిబ్బంది చేసే అవమానాలు భరిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఆ ఊబిలోంచి బయట పడలేక లబోదిబోమనే కుటుంబాలు పల్లెలలో పెద్దసంఖ్యలో దర్శనమిస్తున్నాయి.

రుణం ఇవ్వకుండానే పరువు తీసే సిబ్బంది..

ఈ ఫైనాన్స్ కంపెనీ ద్వారా రుణం తీసుకునే కుటుంబానికి ఆదిలోనే సగం పరువు పోతోంది. మార్టిగేజ్ చేయబోయే ఇంటి వద్దకొచ్చి కొలతలు వేస్తారు. నాలుగు దిక్కుల నుంచి ఫోటోలు తీస్తారు. ష్యూరిటీ ఇచ్చే వ్యక్తి ఇంటినీ ఫోటోలు తీస్తారు. పరిశీలన పేరుతో ఒకటికి నాలుగుసార్లు వచ్చి ఊరంతా ఆ కుటంబం గురించి ఆరా తీస్తారు. ఈ ఇల్లు తాకట్టుకు పోతోందని సగం ఊరికి అప్పటికే తెలిసేలా చేస్తారు. దీంతో అప్పటిదాకా కాపాడుకున్న పరువు కాస్తా పోతుంది.

కోటగంగమ్మకు జ్యోతులు

పెద్దతిప్పసముద్రం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మల్లెల గ్రామంలో మంగళవారం మహిళలు కోటగంగమ్మకు జ్యోతులను మోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా వినాయక చవితి అయిపోయిన మరుసటి రోజు గ్రామదేవతల్లో ఒకరైన కోట గంగమ్మకు ఆనవాయితీగా మహిళలు పెద్ద ఎత్తున జ్యోతులను సమర్పించి ఇంటింటికీ బోనాలు పెట్టి, జంతుబలులు సమర్పించి మొక్కుబడులను తీర్చుకుంటారు. రాత్రి గ్రామంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించి గ్రామంలో మేళతాళాలు మంగళ వాయిద్యాలు కోలాటలు, చెక్కభజనలు, బళ్లారి డ్రమ్ములతో అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.


కోట గంగమ్మకు సమర్పించేందుకు పెద్ద ఎత్తున జ్యోతులను తీసుకెళుతున్న మహిళలు

వాటర్ షెడ్ల ద్వారా నీటి నిల్వ : పీడీ


వాటర్‌షెడ్ పనులను పరిశీలిస్తున్న పీడీ

పెద్దమండ్యం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జలాలు పెంపొందించడానికే వాటర్ షెడ్ల ద్వారా నీటి నిల్వ అభివృద్ధి పనులు చేపట్టినట్లు డ్వామా పీడీ వెంకటరత్నం ఆదేశించారు. మండలంలో పీడీ పర్యటించారు. సి.గొల్లపల్లి, గుర్రంవాండ్లపల్లి ప్రాంతాల్లో జరుగుతున్న మైక్రో వాటర్‌షెడ్ల అభివృద్ధి నిర్మాణ పనులను పరిశీలించారు. ఎంపీడీఓ కార్యాలయంలో వాటర్‌షెడ్ పథకం ద్వారా జరుగుతున్న పనులపై ఆయా సిబ్బందితో సమీక్షించారు. భూగర్భ జలాలు పెంపొందించడానికి వాటర్‌షెడ్లు దోహదపడాలన్నారు. రైతులకు ఉపయోగపడేలా వాటర్ షెడ్ల నిర్మాణాలు జరగాలని, బాధ్యతగా పని చేయాలన్నారు. సిబ్బందికి కేటాయించిన పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్వామా ఏపీడీ లక్ష్మీనరసయ్య, ఎంపీడీఓ శ్రీధర్‌రావు, వాటర్‌షెడ్ పీఓ రవీంద్రుడు, ఉపాధి ఏపీఓ సురేంద్రనాథ్‌రెడ్డి, సిబ్బంది శివయ్య, మోహన్ వాటర్‌షెడ్ల చైర్మన్‌లు తదితరులు పాల్గొన్నారు.

పట్టుపురుగుల పెంపకంపై అవగాహన

పెద్దతిప్పసముద్రం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) అధ్వర్యంలో తుమ్మరకుంటలో మంగళవారం రైతులకు పట్టుపురుగుల పెంపకంపై అవగాహన సదస్సును నిర్వహించారు. మదనపల్లె అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సిరికల్చర్ (ఏడీ) రామమోహన్ రైతులతో మాట్లాడుతూ పట్టు పరిశ్రమకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టుసాగుకు చేయూతనందిస్తోందని రైతులు పట్టుసాగు, మల్బరీ తోటల పెంపకం పట్టుపురుగులను పెంచుకునేందుకు షెడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వ పథకాల గురించి రైతులకు వివరించారు. పట్టుసాగుతో రైతులకు ఒనగూరే లాభాలు, మల్బరి తోటలను ఆశించే తెగుళ్లు, వాటి నివారణ మార్గాలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. పట్టు గూళ్లను మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడు మృతి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని యువకుడు మృతి చెందిన సంఘటన మదనపల్లె మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె పట్టణం, కోటవీధికి చెందిన నాగరాజు (41) కార్పెంటర్‌గా పనిచేస్తుండేవాడు. 20 ఏళ్ల క్రితం మదనపల్లె పట్టణం రామారావుకాలనీకి చెందిన వనితతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వివాహం జరిగిన ఐదేళ్ల తరువాత విడిపోయి వేరు వేరుగా ఉంటున్నారు. కాగా నాగరాజు మద్యానికి బానిసై ఏడాదిగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండేవాడు. తల్లిని, భార్యను వదిలి విడిగా ఉండడంతో ఎవ్వరూ పట్టించుకునే వారు కాదు. కాగా సోమవారం మధ్యాహ్నం బసినికొండ సమీపంలో ఉరేసుకుని మృతి చెందాడు. మంగళవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో తల్లి లతను పోలీసులు విచారించారు. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కుక్కల దాడిలో దూడ...


కుక్కల దాడిలో మృతి చెందిన దూడ

రామసముద్రం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంతలపేటలో వీధి కుక్కలు దాడి చేసి లేగ దూడను చంపేశాయి. గ్రామానికి చెందిన కుమార్‌కు రెండు ఆవులు ఉన్నాయి. వాటిలో ఒక లేగదూడ ఉంది. వీటిని తన వ్యవసాయ పొలంలో మేత కోసం వదలగా లేగ దూడపై కుక్కలు దాడి చేసి చంపేశాయి. జీవనోపాధికి పెంచుకున్న దూడ మృతితో రైతు కుమార్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వీధి కుక్కలతో మనుషులే కాకుండా మూగ జీవాలు సైతం దాడికి గురవుతున్నాయని, కుక్కల దాడులను అరికట్టడానికి ప్రభుత్వ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టైల్స్ షాపు యజమాని ఆత్మహత్యాయత్నం


సెల్ఫీ వీడియోలో దామోదర్‌రెడ్డి

రాజంపేటటౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఓ టైల్స్ షాపు యజమాని సెల్ఫీ వీడియో తీసు కుంటూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. రాజంపేట పట్టణంలోని మన్నూరు పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న వైష్ణవి టైల్స్ షాపు యజమాని దామోదర్‌రెడ్డి మంగళవారం ఉదయం వీడియో రికార్డింగ్ చేస్తూ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ఇది గమనించిన స్నేహితులు, కుటుంబ సభ్యులు హుటాహుటిన రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించినట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

దాయాదుల ఘర్షణ - కేసు నమోదు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలపై ఘర్షణ పడి దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని బండ్లపై గ్రామం హరిజనవాడకు చెందిన మేకల రెడ్డెప్ప వీఆర్‌వోగా చౌడేపల్లిలో పనిచేస్తున్నాడు. అయితే అతనికి తాతల నుంచి కొంత భూమి సక్రమించింది. సదరు భూమి విషయమై దాయాదులతో కుదరక కోర్టులో కేసులు వేసుకొని కేసు నడుస్తోందని తెలిపారు. అయితే కోర్టులో వున్న భూమిని దాయాదులు సరిహద్దులు చెరిపేస్తూ వారి భూమిలో కలుపుకోవాలని చూశారు. ఇంతలో భూమి వద్దకు వెళ్లిన మేకల రెడ్డెప్ప, తన భార్య వనజలను దాయాదులు నాగరాజు, అతని అన్న కుమారుడు ఖదిరిపతి, అతని చెల్లెలు రాధా, తమ్ముడి భార్య సౌజన్యలు భూమి సరిహద్దు చెరిపేయడమే కాకుండా తమను నానా బూతులు తిట్టి కర్రలతో గాయపరిచినట్లు తెలిపారు. దీంతో రెడ్డెప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

రామసముద్రం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు పేర్కొన్నారు. ఎస్ఐ వివరాల మేరకు.. మండలంలోని కాప్పల్లె పంచాయతీ గుట్టవారి పల్లె గ్రామానికి చెందిన శ్రుతి(21) మదనపల్లెలో జ్ఞానాంబిక కళాశాలలో చదువుతోంది. గత నెల 30న ఉదయం కళాశాలకు వెళ్లిన యువతి తిరిగి రాలేదు. ఈ విషయమై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అంగళ్లు భూవివాదంలో..
పోలీసుల పంచాయితీ


అంగళ్లులోని వివాదాస్పద భూమి

- రాజీకి బాధితులపై ఒత్తిడి
- అప్పటి వైసీపీ వాళ్లే నేటి టీడీపీ

మదనపల్లె, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కబ్జాలు, భూ వివాదాలకు నిలయమైన కురబలకోట మండలం అంగళ్లలో అటు స్థానికులు, ఇటు నాయకులకు కంటిమీద కునుకులేకుండా పోతోంది. ఎప్పుడు ఏం జరుగుతుందో.. ఎవరు ఎప్పుడు భూమిలోకి ప్రవేశించి పనులు చేపడతారో అన్నదే వారి భయం. అప్పటి వైసీపీ పాలనలో జరిగిన సంఘటనలే ప్రస్తుతం పునరావృతమవుతున్నాయి. అంగళ్లు రెవెన్యూ గ్రామం సర్వేనంబర్ 220 అంటేనే అది వివాదాల సుడిగుండమని అందరికీ తెలుసు. సర్వేనంబర్ 220లో మొత్తం 69.42 ఎకరాలు కాగా, అందులో 220-1, 2, 3, 4 సబ్‌డివిజన్లు ఉన్నాయి. ఇందులో హక్కులపై 2017 నుంచీ వివాదం జరుగుతోంది. ఒక సబ్‌డివిజన్‌లో హక్కు ఉంటే, మరో నంబర్‌లోకి ప్రవేశించడం, వివాదం సృష్టించడం, హక్కు లేని వారూ రంగప్రవేశం చేయడం, అమ్మినభూమినే మరొకరికి విక్రయించడం, తదితర కారణాలతో వివాదం ముదిరి పాకానపడింది. ఇందులో రాజకీయ నాయకులు, పోలీసుల రంగప్రవేశం చేయడం, రాజీ కుదుర్చడం షరామామూలైంది. ఈ క్రమంలో అప్పటి వైసీపీ ప్రభుత్వంలోని 2021లో పులివెందుల బ్యాచ్ రంగప్రవేశం భూమిని స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసింది. తర్వాత కడప బ్యాచ్, ఆ తర్వాత తిరుపతి, దాని తర్వాత తంబళ్లపల్లె బ్యాచ్ ఇలా రోజులు గడిచే కొద్దీ హక్కుదారులు మారతారు.. కొత్తగా రాజకీయ నాయకులు ప్రవేశిస్తుంటారు. ఈ క్రమంలో వైసీపీ కబ్జాదారులు కొందరు పెద్దనాయకుల అనుచరుల పేరుతో బాధితుల నుంచి రాజీ పేరుతో అక్కడ కొంత భూమిని కూడా రాయించుకున్నారు. మళ్లీ కొన్నాళ్లకు మామూలే అన్నట్లు మరొకరు రంగ ప్రవేశం చేయడం ఇప్పటికే చేపట్టిన ఫెన్సింగ్‌ను రాత్రికి రాత్రే కూల్చేయడంతో వివాదం మొదలవుతోంది. ఇందులో గూడుకోసం ప్లాట్లు, స్థలాలు కొనుగోలు చేసిన పేద, మధ్యతరగతి ప్రజలు బాధితులుగా మారుతున్నారు. పదిరోజుల క్రితం మరోసారి వివాదం జరగడం, సర్వే పేరుతో పోలీసులు, రాజకీయ నాయకుల ప్రవేశంతో అంగళ్లు మరోసారి ఉక్కిరిబిక్కిరి అయింది. ఇక అంతే అప్పటి నుంచీ పోలీసులు ప్రవేశించినట్లు స్థానికులు చెబుతున్నారు. నిత్యం బాధితులను పోలీస్‌స్టేషన్లకు పిలిపించి పంచాయితీ పెడుతున్నట్లు వాపోతున్నారు. అప్పుడు వైసీపీలో ఉన్నవాళ్లే ఇప్పుడు టీడీపీ పేరుతో అంగళ్లు భూమి పంచాయితీలో ప్రవేశిస్తున్నారు. అప్పట్లో మధ్యవర్తిగా ఉంటూ వైసీపీ నాయకుల పేరున భూమి రాయించిన వారే.. తిరిగి తాము టీడీపీ అంటూ రంగప్రవేశం చేస్తున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా ఇక్కడ హక్కుదారులు, బాధితులు కాకుండా సంబంధం లేని వారు పోలీసులను ఆశ్రయించి పంచాయితీ పెట్టినట్లు చెబుతున్నారు. ఇప్పటికే వైసీపీ నేతలకు రాయించిన భూమిని తిరిగి రాయిస్తామని, మిగిలిన భూమిని కూడా తమపేరుతో రాయించాలని స్టేషన్‌లో పంచాయితీ పెట్టి బాధితులపై ఒత్తిడి చేస్తున్నారు. అయితే ఆ భూమి ప్రస్తుతం కోర్టు కేసులు, క్రిమినల్ కేసులు ఉండటంతో రిజిస్ట్రేషన్లకు అవకాశం లేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. ఇక్కడ ఇప్పటికీ వైసీపీ పాలనే నడుస్తోందని బాధితులు వాపోతున్నారు.

డీఎస్పీ ఏమన్నారంటే

అంగళ్లు వివాదంలో పోలీసుల జోక్యంపై స్థానిక డీఎస్పీ మహేందర్‌ను వివరణ కోరగా.. సివిల్ కేసుల్లో పోలీసులు జోక్యం చేసుకోరాదని, అంగళ్లు భూ వివాదంలో పోలీసులు పంచాయతీలు చేస్తున్నట్లు తెలిస్తే, విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్థానికులకు టోల్‌గేట్ వసూలు చేయొద్దు

- తుమ్మనంగుట్ట టోల్‌గేట్ వద్ద స్థానికుల నిరసన


టోల్‌గేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

ములకలచెరువు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ముంబై-చెన్నై జాతీయ రహదారిపై కొత్తగా ఏర్పాటు చేసిన టోల్‌గేట్ ఎదుట మంగళవారం స్థానికులు నిరసనకు దిగారు. టోల్‌గేట్‌లో స్థానికులకు మినహాయింపు ఉన్నా టోల్ వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు తుమ్మనంగుట్ట టోల్‌గేట్ వద్ద మంగళవారం ఆందోళన చేపట్టి అనంతరం మాట్లాడుతూ టోల్‌గేట్‌కు ఇరువైపులా ఉన్న గ్రామాలకు రాకపోకలు సాగించే సమయంలో టోల్ వసూలు చేస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. బురకాయల కోట నుంచి రెండు కి.మీ. దూరంలో ఉన్న తుమ్మనంగుట్ట, గోళ్లపల్లె వెళ్లి వచ్చే టమోటా వాహనాలకు, పాలబండ్లకు రెండు సార్లు టోల్ వసూలు చేస్తున్నారన్నారు. కురబలకోట మండలం ముదివేడు వద్దనున్న టోల్‌గేట్ వద్ద స్థానికులకు టోల్ వసూలు చేయడం లేదని, ఇక్కడ మాత్రం వసూలు చేస్తూ ఇబ్బందులు పెడుతుండడం సరికాదన్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని స్థానిక వాహనాలకు టోల్ లేకుండా పాసులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మస్తాన్‌రెడ్డి, నేతలు గోపాల్‌రెడ్డి, విజయ్ కుమార్, అనిల్‌కుమార్, జనార్ధన్‌రెడ్డి, మౌళాలి, పుల్లప్ప, చాంద్‌బాషా, బావాజీ, మస్తాన్, పూల శ్రీధర్, కేశవ, వంశీ పాండే తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం.. మంత్రి లోకేశ్

సీకేదిన్నె, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఎటువంటి సమస్య వచ్చినా పార్టీ అండగా ఉంటుందని మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. స్థానిక సభాప్రాంగణం వద్ద మధ్యాహ్నం కమలాపురం నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ అందరం ఒక కూటమి సభ్యులుగా పనిచేయాలని.. ఎవరికి ఎటువంటి సమస్య వచ్చినా.. భయపడాల్సిన అవసరం లేదని నేరుగా తెలియజేస్తే వారికి అండగా ఉంటామన్నారు. మేము కూడా కొన్ని తప్పులు చేస్తుంటామని... ఎత్తిచూపితే పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లినవారికి మంచి గుర్తింపు ఇవ్వడంతోపాటు తగిన పదవులు ఇస్తామన్నారు. ఈనెలాఖరు వరకు అన్నిస్థాయిల్లో కమిటీలు పూర్తిచేస్తామన్నారు. జగన్‌ను కలవడానికి ఇప్పుడు కూడా వీఐపీ పాస్ కావాలంటున్నారని.. అహంకారంతో కాదు, ప్రజల మనస్సు ప్రేమతో గెలువాలని అప్పుడే వారికి దగ్గరవుతామన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాలు అయిదేళ్లు సమర్థవంతంగా నిర్వహించడం... నాయకులు, కార్యకర్తలు కష్టం ఫలితంగా 2024లోఘన విజయం సాధించామన్నారు. పార్టీ కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. నాయకులు నిత్యం ప్రజల్లో ఉండాలని.. ప్రజల చుట్టూ మీరు తిరిగితే.. పార్టీ నీ చుట్టూ తిరుగుతుందన్నారు. సిఫార్సుల ద్వారా పదవులు రావని, పనితీరు ద్వారా మాత్రమే గుర్తింపు వస్తుందన్నారు.పార్టీ సభ్యత్వం, సుపరిపాలన, తొలి అడుగు తదితర కార్యక్రమాలను బాగా అమలు చేసి వారిని గుర్తించడం జరిగిందన్నారు. పార్టీ పదవులు కూడా క్రియాశీలకంగా పనిచేసిన వారికే అందిస్తామన్నారు. ప్రతిచోట కార్యకర్తలకు సమయం కేటాయించి వారి సమస్యలుతెలుసుకోవడం జరుగుతుందన్నారు. దాంతో పాటు వారితో కలిసి ఫోటోలు దిగడం జరుగుతుందన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్, పక్కన మంత్రి సవిత, ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, పుత్తా నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి

ప్రేమతో ప్రజల మనస్సు గెలువాలి

అహంకారంతో కాదు ప్రేమ, ఆప్యాయతలతో మనం ప్రజల మనస్సు గెలువాలని మంత్రి లోకేష్ తెలిపారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నట్లే వ్యవహరించాలి. అహకారం లేకుండా బాధ్యతగామెలిగితే గతంలో ఎన్నడు లేని విధంగా కడప జిల్లాలో అధిక సీట్లు సాధించామన్నారు. ఓర్పు, సహనంతో రాజకీయం చేయడంతోనే ఇది సాధ్యమైందన్నారు. వైసీపీ వారు అధికారంలో ఉన్నప్పుడు అహంకారంతో విర్రవీగడంతో 151 సీట్లు 11 సీట్లు అయ్యాయన్నారు. కాగా, 2019-24 మధ్య తప్పుడు కేసులు ఎదుర్కొన్న కార్యకర్తలకు విముక్తి కలిగిస్తామని మంత్రి లోకేశ్ తెలిపారు. అటువంటివారి వివరాలు తమ దృష్టికి తేవాలన్నారు.

94 మంది కార్యకర్తలకు అవార్డులు

కమలాపురం నియోజకవర్గంలో 94 మంది ఉత్తమ కార్యకర్తలను గుర్తించి మంత్రి లోకేష్ అవార్డులు అందజేశారు. ప్రతి కార్యకర్త కష్టాన్ని గుర్తిస్తానని.. వారికి తగిన న్యాయం చేస్తానని తెలిపారు. కమలాపురం నియోజకవర్గంలో చింతకొమ్మదిన్నె మండలం నుంచి ఎక్కువ మంది ఉత్తమ కార్యకర్తల అవార్డు అందుకున్నారు. వారందరిని మంత్రి లోకేశ్‌తో పాటు ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, టీడీపీ ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఉత్తమ కార్యకర్త అవార్డు అందుకున్న వారిలో టీవీ క్రిష్టారెడ్డి, గంధం మోహన్‌బాబు, శ్రీనివాసులరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, దర్బార్‌బాష, శివశంకర్, జబివుల్లా, శివానందయాదవ్, బిట్టి ఆది, భద్ర, బ్రహ్మానందరెడ్డి, నంద, తదితరులు ఉన్నారు.

వినతులు స్వీకరణ

మంత్రి లోకేశ్ మంగళవారం ఉదయం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి వినతి పత్రాలు స్వీకరించడంతో పాటు వారితో ఫొటోలు దిగి సంతోషపరిచారు. ఆద్యంతం కార్యకర్తలకే అధిక సమయం కేటాయించడంపట్ల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు

మంత్రి పర్యటనను విజయవంతం చేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కమలాపురం ఎమ్మెల్యే చైతన్యరెడ్డి అభినందనలు తెలిపారు. రాబోయే కాలంలో నియోజకవర్గ అభివృద్ధికి మరింత పాటుపడుతానని మంత్రి లోకేష్ తెలిపినట్లు ఎమ్మెల్యే తెలిపారు.


మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి నుంచి ఉత్తమ కార్యకర్త అవార్డులు అందుకుంటున్న కార్యకర్తలు

సులువైన ఆటో ప్రయాణం కోసం..

● ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల ఆటోమ్యాట్ యాప్ రూపకల్పన


ఆటోమ్యాట్ అప్లికేషన్ తయారుచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించిన డైరెక్టర్ కుమారస్వామి గుప్త, తదితరులు

వేంపల్లె, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ ఇంజనీరింగ్ విద్యార్థులు తమ సొంత ఆలోచనతో ఆటోమ్యాట్ యాప్‌ను రూపొందించారు. మంగళవారం ట్రిపుల్‌ఐటీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో యాప్ పనితీరు గురించి విద్యార్థులు శివశంకర్, సాయినాథ్, రవితేజ, అంకిత్, సాయికుమార్‌లు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఆటోలు అందుబాటులో ఉండడం, నిజమైన పారదర్శకమైన ధరల విధానం, విద్యార్థుల భద్రత, ఆటో డ్రైవర్ల ప్రవర్తన, అధికచార్జీలు, ఫిర్యాదులు వంటి ఆప్షన్లు ఈ యాప్‌లో ఉంటాయని, ఆటో డ్రైవర్ల మొబైల్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డైరెక్టర్ కుమారస్వామి గుప్త మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన అప్లికేషన్లు రూపొందించిన విద్యార్థులు అభినందనీయులన్నారు. ప్రయోగాలు చేసి సమాజానికి ఉపయోగపడే కొత్తకొత్త ప్రయోగాలు చేయాలని సూచించారు. అనంతరం విద్యా ర్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఏఓ రవికుమార్, అకడమిక్ డీన్ కైలాష్, హెచ్ఓడీ రత్నకుమారి, శరవన్ కుమార్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గండికోట నుంచి 10 వేల క్యూసెక్కులు విడుదల


గండికోట నుంచి మైలవరానికి విడుదలవుతున్న నీరు

కొండాపురం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి మంగళవారం మధ్యాహ్నం నుంచి 10,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 10,700 క్యూసెక్కులు, వరద నీరు మరో 500 క్యూసెక్కులు వచ్చి చేరుతోందన్నారు. కాగా సీబీఆర్‌కు 1000 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 23.473 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు.

కుమారుడిపై తండ్రి దాడి

జమ్మలమడుగు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో కుమారుడిపై తండ్రి దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ రామకృష్ణ వివరాల మేరకు... ఎస్.ఉప్పలపాడు గ్రామానికి చెందిన రమేష్‌బాబు రెండు సెంట్ల స్థలానికి సంబంధించి రిజిస్టర్ చేసి ఇవ్వాలని తన తండ్రి మారెన్నను కోరాడు. ఈ విషయంపై ఇద్దరి మధ్య మాట మాట పెరిగి గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో మారెన్న మచ్చుకత్తితో కుమారుడిపై దాడి చేశాడు. అదే సమయంలో అడ్డు వచ్చిన తల్లి యల్లమ్మపై దాడి చేశాడు. దీంతో తలకు గాయాలైన రమేష్‌బాబును జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

డ్వామా సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి


మంత్రి లోకేశ్‌ను కలిసి విన్నవిస్తున్న జేఏసీ చైర్మన్

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి):మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (డ్వామా)లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని మంత్రి నారా లోకేశ్‌కు డ్వామా ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా చైర్మన్ కె.మునిశేఖర్‌రాజువినతి పత్రం సమర్పించారు. మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రిని కలిసి సమస్యలను విన్నవించారు. అన్ని కేడర్ల వారికి గ్రేడ్ ఫిక్సేషన్ అమలు చేయడంతో పాటు అన్ని రకాల అలవెన్సులను బేసిక్‌తో కలిపి ఇవ్వాలని కోరారు. అదే విధంగా 2022 వేతన సవరణ ప్రకారం 23 శాతం వేతన పెంపును వెంటనే ఇవ్వాలని, మూడేళ్లు పూర్తయిన ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అందరికి ఎఫ్‌టీఈలుగా కన్వర్ట్ చేయాలని కోరారు. గత ఐదు సంవత్సరాల నుంచి అమలు చేయని అన్ని కేడర్ల వారికి కేరీర్ అడ్వాన్స్‌మెంట్ పాలసిని వెంటనే అమలు చేయాలని కోరారు. కేరీర్ అడ్వాన్స్‌మెంట్ పాలసీలో భాగంగా పదోన్నతుల వారికి నష్టపోయిన ఇంక్రిమెంట్లను చెల్లించాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, క్యాష్‌లెస్ హెల్త్‌కార్డులను ఇప్పించాలని కోరారు.

పింఛన్ డబ్బులతో జూనియర్ లైన్‌మ్యాన్ పరారీ

● లబోదిబోమంటూ ఎంపీడీవో కార్యాలయానికి చేరిన వృద్ధులు ● పోలీసులకు ఫిర్యాదు చేసిన పంచాయతీ సెక్రటరీ

కాశినాయన, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) కాశినాయన మండల కేంద్రమైన నర్సాపురం గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న జూనియర్ లైన్‌మ్యాన్ దర్శి రాజశేఖర్ సెప్టెంబరు నెలకు సంబంధించి రూ.2,08,500 పింఛన్ డబ్బుతో కన్పించకుండా పోయాడని ఆ గ్రామ సచివాలయ పంచాయతీ సెక్రటరీ డి.సులోచన మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగస్టు 31వ తేదీ మూలపల్లె, పర్సనపల్లె గ్రామాలలో 63 మంది పింఛన్‌ల పంపిణీకి సంబంధించి రూ.2,86,500 ఇచ్చామన్నారు. సెప్టెంబరు 1 మధ్యాహ్నం వరకు 18 పింఛన్‌లకు రూ.78,000 పంచాడని.. ఆతర్వాత కన్పించకుండా పోయాడన్నారు. ఫోన్ చేసినా ఎత్తడం లేదన్నారు. అతనిపై అధికారులకు తెలియజేసి వారి ద్వారా ఫోన్ చేయించినా స్పందించలేదన్నారు. ప్రస్తుతం అతని వద్ద 45 పెన్షన్‌లకు సంబంధించి రూ.2,08,500 నగదు ఉందన్నారు. ఈవిషయం పైగ్రామాల వృద్ధులకు తెలియడంతో వారంతా లబోదిబోమంటూ మంగళవారం దాదాపు రెండు కి.మీ. నడుచుకుంటూ ఎంపీడీవో కార్యాలయానికి చేరుకొని ఆరా తీశారు.


నర్సాపురం పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న పంచాయతీ సెక్రటరీ

అక్కడి అధికారులు పింఛన్ డబ్బు గురించి ఆందోళన చెందవద్దని.. ఇంటి వద్దకే వచ్చి ఇస్తారని సర్దిచెప్పడంతో వృద్ధులు వెనుదిరిగి పోయారు.

పైపులు పీకేస్తే.. మా పొలాలకు నీరెలా..!

● అధికారులతో రైతుల వాగ్వాదం

చాపాడు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమాపురం గ్రామం వద్ద గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే మేనేజర్ సాయిరెడ్డి, సింహాచలంతో రైతులు మంగళవారం వాగ్వాదానికి దిగారు. ఆ గ్రామం వద్ద నేషనల్ హైవే నిర్మిస్తున్నారు. నెలన్నర రోజుల క్రితం రోడ్డుకు ఇరువైపుల రైతుల పొలాలకు సాగునీరు పారేందుకు రోడ్డు అడుగు భాగంలో పైపులు నిర్మించారు. మంగళవారం పోలీసుల సహాయంతో వాటిని మళ్లీ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. పైపులు తొలగిస్తే తమ పొలాలకు సాగునీళ్లు అందవని రైతులు అడ్డుకున్నారు. వేరేచోట పైపులు ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పడంతో అక్కడ భూమి కన్నా ఎత్తుగా ఉండడంతో అనుకూలంగా లేవని రైతులు చెబు తున్నా.. వారి మాటలు వినకుండా అధికారులు పైపులను తొలగించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

సౌమ్యనాథస్వామి ఆలయంలో పవిత్రాల ప్రతిష్ఠ

నందలూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సౌమ్యనాథస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం ఘనంగా పవిత్రాల ప్రతిష్ఠ నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బాలబోగము, పవిత్ర హోమం, బలిహరణ, శాత్తుమొర, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. సాయంత్రం పవిత్ర హోమం, నివేదన, శాత్తుమొర గోష్ఠి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు సాయికృష్ణ, పలువురు అర్చకులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 3న పవిత్రాల సమర్పణ, పవిత్ర హోమం, శాత్తుమొర, నివేదన, 4న మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన, కుంభప్రోక్షణ, మహానివేదన, పవిత్ర వితరణ తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు ఊరేగింపు నిర్వహిస్తారని తెలియజేశారు.


హోమం చేస్తున్న అర్చకులు, స్వామి వారికి పవిత్రాలు సమర్పించిన దృశ్యం

వరి నాట్లకు కూలీల కొరత

● జిల్లాలో ముమ్మరంగా నాట్లు ● 30804 హెక్టార్లలో సాగు లక్ష్యం
● ఒకేసారి వేస్తుండడంతో డిమాండ్ ● రెట్టింపు కూలీ ఇస్తామన్నా..
దొరకని కూలీలు ● నార్లు ముదిరిపోతాయనే ఆందోళనలో రైతులు


వరి నాట్లు వేస్తున్న ఇద్దరు కూలీలు

కడప రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడక పోవడంతో ఖరీఫ్ వ్యవసాయ పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. జూన్, జూలై నెలలో రైతులు వర్షం కోసం ఎదురు చూపులు చూశారు. చివరకు ఆగస్టు మొదటి వారం నుంచి జిల్లాలో ఓ మోస్తారు వర్షాలు పడటంతో అన్నదాతలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు వస్తుండడంతో కేసీ కెనాల్, పెన్నానది పరివాహ ప్రాంతాలతో పాటు ఇతర వరి సాగు ఆధారిత ప్రాంతాల్లో రైతులంతా ఒకేసారి వరినాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో కూలీల కొరత ఏర్పడింది. సాధారణ రోజుల కన్నా రెట్టింపు కూలీ ఇస్తామంటున్నా కూలీలు అందుబాటులో లేని పరిస్థితి. మామూలు రోజుల్లో వరి నాట్లు వేసేందుకు ఒక ఎకరాకు రూ.5వేలు ఇచ్చేవారు. ఈ క్రమంలో ఆగస్టు మొదటి వారం వరకు అడపాదపా చేపట్టిన వరినాట్లుకు రూ.5వేలు చెల్లించారు. ఇప్పుడు రూ.7వేలు ఇవ్వడంతో పాటు అదనంగా ఆటో చార్జీలు కూడా ఇచ్చేందుకు సిద్ధపడుతున్నా కూలీలు దొరకడం లేదు. సాధారణంగా పొలం పనులకు వచ్చే మహిళా కూలీలకు రోజుకు రూ.250 నుంచి రూ. 300ల వరకు ఇస్తారు. అదే వరినాట్లు వేసే కూలీలకు రోజుకు రూ. 500 వరకు ఇస్తారు. ఒక ఎకరా వరి నాటుకు 10 మంది వరకు కూలీలు పడతారు. అదే ఒప్పందం అయితే ఒక ఎకరాకు 5 నుంచి 7 మంది కూలీలు నాట్లు వేస్తారు.

15 మండలాల్లో ముమ్మరంగా వరినాట్లు

బంగాళాఖాతంలో ఏర్పడుతున్న అల్పపీడనాలతో ఆగస్టు మొదటి వారం నుంచి కురుస్తున్న వర్షాలకు కేసీ కెనాల్ ఆయుకట్టుతో పాటు, పెన్నానదికి వరద నీరు ప్రవహిస్తోంది. అలాగే జిల్లాలోని గండికోట, మైలవరం, బ్రహ్మంసాగర్, సర్వరాయసాగర్ తదితర ప్రాజెక్టులకు వరద నీరు వచ్చిచేరుతోంది. తద్వారా ఆయా ప్రాంతాలలోని చెరువులకు కూడా నీరు చేరుతోంది. దీంతో ఆయా ఆయకట్టు కింద ఉండే చాపాడు, ఖాజీపేట, దువ్వూరు, బి.మఠం, ప్రొద్దుటూరు, ఎస్. మైదుకూరు, చెన్నూరు, పోరుమామిళ్ల, జమ్మలమడుగు, చక్రాయపేట, బికోడూరు, వల్లూరు, కలసపాడు, సిద్దవటం, పెండ్లిమర్రి, కడప, రాజుపాళెం, యర్రగుంట్ల, కాశినాయన మండలాల్లో వరినాట్లు ఊపందుకున్నాయి. 2025 ఖరీఫ్‌లో 30,804 హెక్టార్లలో వరి పంట సాగు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 8082 హెక్టార్లలో మాత్రమే వరి సాగైంది. ఇంకా 22,722 హెక్టార్లలో సాగు కావాల్సి ఉంది.


కాలిబాటలు ఏర్పడేలా వరి నాట్లు వేస్తున్న వలస కూలీలు



వలస కూలీలతో వరినాట్లు

● ఆసక్తి చూపుతున్న కేసీ రైతులు

దువ్వూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేసీ ఆయకట్టులో వలస కూలీలతో వరి నాట్లు వేయించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. దువ్వూరు మండలంలో పది వేల ఎకరాలకుపైగా కేసీ ఆయకట్టు ఉంది. ఇంచుమించు ఏడు వేల ఎకరాల్లో ప్రతి ఏటా వరి సాగు అవుతుంది. గత నాలుగేళ్లుగా వలస కూలీలు నాట్లు వేసే సమయంలో ఇక్కడకు రావడం జరుగుతోంది. ఈసారి మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, ఉత్తరాఖాండ్ రాష్ట్రాల నుంచి అధికంగా కేసీ ఆయకట్టు పరిధిలో నాట్లు వేసేందుకు వచ్చారు. మండల పరిధిలో 30 బ్యాచ్‌ల్లో సుమారు 800 మంది కూలీలు వచ్చినట్లు వారికి పని కల్పిస్తున్న మధ్యవర్తులు తెలుపుతున్నారు. దువ్వూరుతోపాటు చాపాడు, మైదుకూరు, ఖాజీపేట, రాజుపాళెం మండలాల్లో కూడా ఈ కూలీలే పని చేస్తున్నారు. సాదారణంగా వారు మరాఠి, బెంగాళి, హిందీ భాషలు మాట్లాడుతున్నారు. వరినాటే వలసకూలీలకు రైతులకు మధ్యవర్తులు అనుసంధానంగా వ్యవహరిస్తున్నారు.

సాగు ఖర్చు తగ్గుతోంది

వలస కూలీలతో నాట్లు వేయించడం వలన ఎకరాకు అయ్యే ఖర్చు వెయ్యి నుంచి రూ.1500 దాకా తగ్గుతోందని రైతులు అంటున్నారు. ఇదే కాకుండా పొలాల్లో నారు మోసుకోవడం, నాటే సమయంలో కాలిబాటలు ఏర్పడే విధంగా నాట్లు వేయడంతో రైతులకు భారం తగ్గుతోంది. ఈ తరహాలో వరి సాగు చేయడం వలన తెగుళ్లు తగ్గుతాయని వ్యవసాయశాఖ అధికారులు తెలుపుతున్నారు. వరి పిలకలు అధికంగా కట్టి దిగుబడి పెరుగుతుందని చెబుతున్నారు.

పూర్తిచేసి పుణ్యం కట్టుకోండి..!

- రెండు మండలాలు కలిపే రోడ్డుపై అలసత్వం తగదు
- నిధులు ఇస్తే ఎంతో మేలు
- అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్న ప్రజలు

చెన్నూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన చెన్నూరు నుంచి బుడ్డాయపల్లెకు వెళ్లే దారి కొన్నేళ్లుగా అత్యంత అధ్వానంగా ఉంది. గత టీడీపీ పాలనలో అంతో ఇంతో పనులు చేశారు తప్ప అంతకుముందు పాలకులు పనులు సరిగా లేకపోవడం, గుంతలమయంగా మారడం కంకర లేయడం జరిగింది. దీంతో బుడ్డాయపల్లె మీదుగా వల్లూరు మండలానికి వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఉన్నది కొంత దూరం అయినా అది కాస్త నరకాన్ని చూపించేది. ఆ తరువాత వచ్చిన వైసీపీ పాలనలో రోడ్లు బాగు చేయాలన్న మాట ఊసే లేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అభివృద్ధి పనులుమండల వ్యాప్తంగా కోట్లాది రూపాయలతో జరుగుతున్నాయి కాకపోతే చెన్నూరు మండలం నుంచి వల్లూరు మండలం వెళ్లే బుడ్డాయపల్లె ఆర్అండ్‌బీ రోడ్డు మాత్రం బాగు చేయలేదని పలుమార్లు చెన్నూరుతో పాటు బుడ్డాయపల్లె గ్రామ ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరడం జరిగింది. ఇటీవల డీఎంఎఫ్ నిధుల కింద రూ.25లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అందులో ప్రస్తుతానికి రోడ్డు కోసం రూ.2లక్షలు, డ్రైనేజీ కోసం రూ.3.50 లక్షలు వెచ్చించారు. అయితే రూ.25లక్షల నిధుల్లో ఈ రూ.5.50లక్షల నిధులు ఏదోవంతు కాబట్టి జరిగిన పని మాత్రం అంతంతే. చినుకులు పడ్డాయంటే రోడ్డుపనులు చేపట్టిన క్రమంలో ఏర్పడిన గుంతల్లో నీళ్ల నిలవడం, దాని వల్ల ఇబ్బందులు పడడం మామూలైంది. ఫలితంగా ప్రజలు ఆ రోడ్డులో రాకపోకలు సాగించాలంటే మరింత ఇబ్బందులను ఎదుర్కోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఇప్పటికైనా రోడ్డును పూర్తి చేసి పుణ్యం కట్టుకుని రెండు మండలాల మధ్య తక్కువ దూరంగా ఉన్న ఈ ఆర్అండ్‌బీ రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న బుడ్డాయపల్లె రోడ్డు

రోడ్డు వేయాల్సింది 220 మీటర్లే..: ప్రస్తుతం డీఎంఎఫ్ నిధుల కింద మంజూరైన రోడ్డు 220 మీటర్ల పొడవు, ఆరు మీటర్ల వెడల్పు ఉంటుంది. గతంలో మొన్నటి వరకు ఈ రోడ్డు చాలా ఇరుకుదారి. 3 మీటర్ల మేర ఉండేది. ఇప్పుడు ఈ రోడ్డు కాస్త ఆరు మీటర్ల వెడల్పు చేశారు. 220 మీటర్ల పొడవునా ఆరు మీటర్ల వెడల్పు రోడ్డు వేయాల్సి ఉంది.

స్పందించి నిధులు ఇవ్వాలి



బుడ్డాయపల్లె రోడ్డు ఎంతో మందికి అవసరం. ఇది ఆర్అండ్‌బీ రోడ్డు. గతంలో కంకర తేలిన రోడ్డును ప్రస్తుతం డీఎంఎఫ్‌వో నిధుల కింద వెడల్పు చేసేందుకు పనులు చేపట్టారు. కొంత వరకు ప్రారంభ పనులు జరిగాయి. మిగిలిన 19.50 లక్షలు నిధులు వస్తే త్వరగా రోడ్డు పూర్తవుతుంది. చెన్నూరు, వల్లూరు మండలాలు కలిపే ఈ కీలకమైన రోడ్డుకు ప్రజాప్రతినిధులు నిధులు ఇచ్చి ఆదుకోవాలి. ఈ రోడ్డు బాగైతే కాలేజీ విద్యార్థులు, కమలా పురం, వల్లూరు, చెన్నూరుకు వచ్చే వారికి, చెన్నూరు నుంచి అటు వైపు వెళ్లేవారికి ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ఇలాంటి రోడ్డు విషయంలో త్వరగా నిధులు మంజూరు చేస్తే ఎంతో మేలు.

పెద్దసుబ్బారెడ్డి, బుడ్డాయపల్లె.

జనసేన సైనికుల మెగా పండుగ పవన్‌కల్యాణ్ పుట్టినరోజు



అన్నదానం నిర్వహిస్తున్న తుంగారమణయ్య

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్‌కళ్యాణ్ పుట్టిన రోజు అంటే ప్రతి జనసైనికునికి పండుగ అని కడప జనసేననాయకుడు తుంగా రమణయ్య అన్నారు. పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా రమణయ్య ఆధ్వర్యంలో కడపనగరంలోని శ్రీవిశ్వప్రగతి చిట్‌ఫండ్ ఆఫీస్‌లో కేక్ కట్ చేశారు. అనంతరం కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ స్ఫూర్తితో పేదలకు అన్నదానకార్యక్రమం నిర్వహించడం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు రంజిత్‌కుమార్, ఉంగరాల విజయ్, పోలదాసు నాగరాజు, తిరుమలశెట్టి సిద్ధార్థ, అతికారి నాగేంద్ర, సాయి కృష్ణ ఆచారి, తుంగా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుకాల పూజలు



అలంకారంలో విజయదుర్గాదేవి, రాహుకాల దీపాలను వెలిగిస్తున్న మహిళలు

కడప కల్చరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగర బిల్టప్ సమీప విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం ఘనంగా రాహుకాల పూజలు నిర్వహించారు. భారీ సంఖ్యలో మహిళా భక్తులు హాజరై అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4-30 గంటల వరకూ రాహుకాల దీపాలను వెలిగించారు.

సనాతన ధర్మమే పవన్‌కళ్యాణ్ అభిమతం



అన్నదాన కార్యక్రమంలో జీవీ రమణ

కడప మారుతీనగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మమే పవన్‌కళ్యాణ్ అభిమతమని జనసేన నాయకుడు రమణ పేర్కొన్నారు. పవన్‌కళ్యాణ్ జన్మదినం సందర్భంగా జనసేనపార్టీ నగర నాయకుడు అప్పన్నగారి రాజగోపాల్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సంధ్య సర్కిల్ వద్ద మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జి.వి.రమణ హాజరై ప్రజలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నగర నాయకులు సాయి స్వరూప్, పి. హర్ష, సిద్ధు, అర్జున్, రాము, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణనాథుడి గ్రామోత్సవం



అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

కడప రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం 45వ డివిజన్ పరిదిలోని ఊటుకూరులో మంగళవారం చెన్నకేశవ స్వామి కమిటీ ఆధ్వర్యంలో గణనాథుడి గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించి భక్తులకు అన్నప్రసాద చేశారు. అనంతరం వినాయకుని విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా చిన్నారుల కోలాటాలు, యువకులు నృత్య ప్రదర్శనలు అలరింపజేశాయి. అనంతరం కేసీ కెనాల్‌లో అంగరంగ వైభవంగా వినాయకుని విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. కాగా లడ్డూను వేలంలో టీడీపీ నేత గోసుల సుబ్బారెడ్డి రూ.1,57,000లకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు రాజగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు,అనగూరి హరినాథరెడ్డి పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి

కమిషనర్ మనోజ్ రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో జరిగే నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కమిషనర్ మనోజ్ రెడ్డి తెలిపారు. ఈనెల 4వ తేదీలోగా పూర్తికావాలని సూచించారు. మంగళవారం కడప నగరం గాంధీ నగర్ హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న డయాస్ నిర్మాణ పనులను ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. అలాగే పాఠశాలలో మరమ్మతులు పూర్తిచేసిన మరుగుదొడ్లను తనిఖీ చేసి, కొత్తగా విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన వాటర్ ట్యాప్సను కూడా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనులను సెప్టెంబరు 4వ తేదీలోగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ధనలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

డీకేటీ పట్టాలు మంజూరు చేయండి

మంత్రి నారా లోకేశ్‌కు ఇప్పెంట గిరిజనుల వినతి

సీకేదిన్నె, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పెంట గ్రామానికి చెందిన 45 గిరిజన కుటుంబాలు కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నామని, ఎలాంటి ఆధారంలేని తాము బుగ్గవంక ప్రాజెక్టు వద్ద 60 ఎకరాల్లో చదును చేసుకుని పోడు వ్యవసాయం చేస్తున్నామని మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకొచ్చి ఈ భూములకు డీకేటీ పట్టాలు మంజూరు చేయాలని విన్నవించారు. మంగళవారం మంత్రి లోకేశ్ జిల్లా పర్యటనలో భాగంగా సీకేదిన్నెకు వచ్చిన సందర్భంగా వారు ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. అదే విధంగా మండలస్థాయి కంప్యూటర్ ఆపరేటర్లకు జీతాలను రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ ద్వారా చెల్లించాలని, కొప్పర్తి గ్రామంలో 2008లో ఏపీఐఐసీ సేకరించిన అర ఎకరం భూమికి ఇప్పటి వరకు నష్టపరిహారం చెల్లించలేదని తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. సిద్దవటం, అట్లూరు, బద్వేలు, మండలాల ప్రజల చిరకాల కోరిక అయిన కడప-పోరుమామిళ్ల రహదారిలో సిద్దవటం పెన్నానదిపై ఖాదర్‌బంగ్లా నుంచి మాచుపల్లె మధ్యలో బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కడప నగరంలోని రజక కుటుంబాలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తులు అందాయి. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ స్పందించి విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

పెండింగ్ రోడ్డుకు పూర్తిగా నిధులు ఇవ్వండి



లోకేశ్‌తో మాట్లాడుతున్న మునిరెడ్డి

వేంపల్లె, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణంలో వైసీపీ హయాంలో చేపట్టి నిలిచిపోయిన ప్రధాన రహదారి పనులు తిరిగి ప్రారంభించి పూర్తిచేయించేందుకు నిధులు కేటాయించాలని మంత్రి నారాలోకేశ్‌కు టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి విజ్ఞప్తి చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా పెండ్లిమర్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వచ్చిన నారాలోకేశ్‌ను మునిరెడ్డి కలిసి రోడ్డు సమస్యను విన్నవించారు. నిత్యం వందలాది వాహనాలు, ప్రజలు తిరిగే రోడ్డు పనులు చేపట్టేలా చొరవ చూపాలని కోరారు. ముచ్చుకోన చెరువుకు నీళ్ల తరలించే పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయని, వేగవంతంగా పూర్తయ్యేలాచూడలని మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

అంగన్వాడీలకు కనీస వేతనం అమలు చేయండి



లోకేశ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న అంగన్వాడీ నాయకురాళ్లు

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటన సందర్భంగా మంత్రి నారాలోకేశ్‌ను అంగన్వాడీ యూనియన్ నాయకులు కలిసి వారి సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు, మినీ అంగన్వాడీకి సంబంధించి అనేక సమస్యలపై మంత్రికి వినతిపత్రం ఇచ్చామని తెలిపారు.వర్కర్లకు వేతనాలు పెంచాలని, అంగన్వాడీ సెంటర్లకు సన్న బియ్యం సరఫరా చేయాలని కోరినట్లు తెలిపారు. మంత్రికి వినతిపత్రం సమర్పించిన వారిలో రూరల్ ప్రాజెక్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగలక్ష్మి, అరుణ,శాంతమ్మ,ప్యారీజాన్ ఉన్నారు.

ఎన్నికల కమిషన్ కుమ్మక్కుపై విచారణ జరగాలి

ధర్నాలో కాంగ్రెస్ నేతలు



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నేతలు

కడప కలెక్టరేట్, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): దేశంలో బీజేపీతో ఎన్నికల కమిషన్‌కుమ్మక్కై ప్రజా స్వామ్యాన్ని అపహాస్యం చేసిందని, ఎన్నికల కమిషన్ అవకతవకలపై విచారణ జరగాలని కాంగ్రెస్ నేతలు ఆసిఫ్‌ఖాన్,సత్తార్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఓట్ల దొంగలు-పదవుల దొంగలు ఎన్డీఏ నేతలంటూ ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగాఏఐసీసీ కోఆర్డినేటర్ ఎస్ఏ సత్తార్, మైనార్టీ నగర అధ్యక్షుడు ఆషీఫ్‌ఖాన్‌లు మాట్లాడుతూ బీజేపీతో ఎన్నికల కమిషన్ కుమ్మక్కయిందని విమర్శించారు. ఈకార్యక్రమంలో ఆర్టీఐ చైర్మెన్ కోటపాటి లక్ష్మయ్యనాసీర్‌ఖాన్, బి.నారాయణ, సీఆర్‌వీ ప్రసాద్, పి.సుబ్బరాయుడు, అన్వర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

పిల్లల విద్య, ఆరోగ్య విషయాలపట్ల జాగ్రత్తలు వహించాలి

కడప రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పిల్లల విద్య, ఆరోగ్య విషయాలపట్ల తగు జాగ్రత్తలు వహించాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫకృద్దీన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కడప నగరం ప్రకాశ్‌నగర్‌లోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమీకృత వెనుకబడిన తరగతుల బాలుర వసతి సముదాయం, జీసస్ సస్టైన్ ఆర్గనైజేషన్ ఫర్ సీకర్స్ హోమ్‌ను సందర్శించారు. వంటశాలను, వసతి గదులు, మరుగుదొడ్లు, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. పిల్లలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్, సిబ్బంది పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనాన్ని అమలు చేయాలి

కడప మారుతీనగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమానవేతనాన్ని తక్షణమే విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వర్తింప చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. ఏ.పీ.ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (3045) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు.అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పలువురు అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ బీమా వారోత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఎల్ఐసీ కార్యాలయ ఆవరణంలో ఉద్యోగులతో స్వచ్ఛభారత్, ఉద్యోగులకు క్విజ్ ప్రోగ్రాం, విద్యార్థినిలకు వకృత్వ పోటీ, మొక్కల పంపిణీని చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ మేనేజర్ జి.కె.ఆర్.వి.రవికుమార్ కూడా పాల్గొన్నారు. కడప గర్ల్స్ హైస్కూల్ విద్యార్థినిలకు ఎల్ఐసీ అధికారులు క్విజ్ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేసి వాటి ప్రాధాన్యతను వివరించారు.

రేపు ఐటీఐలో జాబ్‌మేళా

చక్రాయపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 4వ తేదీ చక్రాయపేట ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వై.రాధాకృష్ణయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కడపలోని ఏఐఎల్ డిక్సన్ వారు నిర్వహించే ఈ జాబ్‌మేళాలలో 10, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, డిప్లమో, బీటెక్ పాసైన వారు అర్హులన్నారు. బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధారాలతో హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

పులివెందుల రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వ్యాధులపట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని నగరిగుట్ట యూపీహెచ్‌సీ డాక్టర్ స్నేహ ప్రత్యూష సూచించారు. మంగళవారం యూపీహెచ్‌సీలో ఆరోగ్య, ఆశాకార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు కేటాయించిన గృహాలలో ఫీవర్ సర్వే, లార్వా సర్వేనిర్వహించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అందించే వైద్యం, ల్యాబ్ పరీక్షలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ

వల్లూరు సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా వల్లూరు మండలంలో మంగళవారం జరిగిన కిచెన్ గార్డెన్ ప్రోగ్రామ్ నిమిత్తం విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి పర్యవేక్షించారు. ఆ మేరకు వల్లూరు మండలం చిన్నలేబాక గ్రామంలో విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీ సీఎస్ఎఫ్ అడిషినల్ డీపీఎం వసంతకుమారి, ఏపీఎం పూర్ణిమ, సీసీలు, ఏపీ సీఎస్ఎఫ్ సిబ్బంది సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో లక్ష్యాన్ని సాధించాలి

వేంపల్లె, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యలో పోటీ పరీక్షలైన గేట్, ఇంజనీరింగ్ సర్వీసుల్లో రాణించేందుకు పట్టుదలతో లక్ష్యం దిశగా కృషిచేయాలని హైదరాబాద్‌కు చెందిన ఏస్ ఇంజనీరింగ్ అకాడమీ ప్రతినిధి మణిమోహన్ త్రినాథ్ తెలిపారు. సోమ, మంగళవారం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో పోటీ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో డైరెక్టర్ గుప్త, ఏఓ రవి, లైబ్రేరియన్ కోన ప్ప, అకడమిక్ డీన్ కైలాష్ పాల్గొన్నారు.

'హామీలు ఏమయ్యాయి'

కమలాపురం రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నారాలోకేశ్ పర్యటన వల్ల ఒరిగేదేమీ లేదని, యువగళం పాదయాత్రలో చెప్పిన హామీలు ఏమాయ్యాయని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో సమా వేశంలో మాట్లాడుతూ 16నెలల కాలంలో కొప్పర్తికి తెచ్చిన కంపెనీ ఒక్కటైనా ఉందా అని ప్రశ్నించారు.

హనుమద్వాహనంపై శ్రీరంగనాథుడు

పులివెందుల రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలో శ్రీరంగనాథస్వామి నూలుపూజ బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామి హనుమద్వాహనంపై దర్శనమిచ్చారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీరంగనాథ స్వామి వారికి పూజలు నిర్వహించారు.









మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి లోకేశ్‌ను సత్కరిస్తున్న వైవీయూ సిబ్బంది, మంత్రికి సమస్యలు తెలుపుతున్న జానమద్ది విజయభాస్కర్, మంత్రితో మాట్లాడుతున్న ఆలంఖాన్‌పల్లె టీడీపీ నాయకులు లక్ష్మీరెడ్డి, ఉమాదేవి, మన్మోహన్‌రెడ్డి

శాస్త్రవేత్తల సూచన మేరకు ఎరువులు వాడాలి



అరటిపరిశోధన స్థానంలో మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

పులివెందుల రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శాస్త్రవేత్తలు సూచించిన మోతాదులో ఎరువులు, పురుగు మందులు వాడాలని పులివెందుల ఏడీఏ అంబ వరం ప్రభాకర్‌రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం పులివెందులలోని అరటిపరిశోధన స్థానంలో పులివెందుల,ముద్దనూరు వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతు విజ్ఞాన యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో పచ్చిరొట్ట ఎరువుల వినియోగం,వాటి ఉపయోగాలు, ఘనజీవామృతం, ద్రవ జీవామృతం, పురుగులు, తెగుళ్ల నివారణకు కష్టాలు వాటి ఉపయోగాలు వివరించారు. అనంతరం అరటి పరిశోధన స్థానం రీసెర్చ్ అసోసియేట్ ప్రవీణ పరిశోధన స్థానంలో జరిగే పరిశోధనల గురించి రైతులకు వివరించారు.కార్యక్రమంలో ముద్దనూరు ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, పులివెందుల టీఏ సునీల్ కుమార్‌రెడ్డి, బీటీఎం రాజారెడ్డి, రవికుమార్‌రెడ్డి,ఏటీఎం రమాదేవి, ఏపీసీఎస్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అధిక మోతాదులో యూరియా వాడితో అనర్థమే

చెన్నూరు సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి):వరి సాగులో రైతులు సిఫారసు చేసిన మేరకే యూరియా వాడాలని, అధిక మోతాదులో వాడితే అనర్థమై పంటకు నష్టం వాటిల్లుతుందని వ్యవసాయశాఖ జిల్లా సంయుక్త సంచాలకుడు బి. చంద్రానాయక్ అన్నారు. మండలంలోని ముండ్లపల్లె గ్రామంలో మంగళవారం రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీదేవి, ఏఈఓలు పావని, రెడ్డి రాజేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

కమలాపురం రూరల్..:వరిలో కాలిబాటలు తెగులు నివారణకు మార్గాలని ఏవో సరస్వతి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని జంబాపురం, గొల్లపల్లె గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వరిపంటను పరిశీలించారు.

నిరుపయోగంగా కియోస్కులు

- యంత్రాల ఏర్పాటుకు లక్షలు నీళ్లపాలు చేసిన గత వైసీపీ యంత్రాంగం
- దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్న వైనం
- మూన్నాళ్ల ముచ్చటకే పరిమితం
- సెల్‌ఫోన్‌లు ఉండగా యంత్రాలు ఎందుకంటున్న రైతన్నలు



వినియోగంలో లేని కియోస్క్ పరికరం

ప్రొద్దుటూరు రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి):గత వైసీపీ ప్రభుత్వంలో ఆర్బాటాల కోసం అనవసర ఖర్చులతో లక్షలాది రూపాయలు నిరుపయోగం చేసింది. దీంతో లక్ష్యం నెరవేరలే దుకదా! లక్షలు మాత్రం దుర్వినియోగమయ్యాయి. ఇందుకు నిదర్శనంగా రైతులు సొంత ఊరిలోనే పంట సాగుకు అవసరమైన ప్రయోజనాలను, మెలకువలను తెలుసుకునేందుకు కియోస్కో యంత్రాలను ఏర్పా టు చేసి నిర్వహణ గాలికి వదిలేసింది. దీంతో అవి మూన్నాళ్ల ముచ్చటకే పరిమితం కాగా రైతు సేవా కేంద్రాల్లో అలంకారప్రాయంగా మారాయి. ప్రొద్దుటూరు వ్యవసాయ శాఖ డివిజన్‌లో ప్రొద్దుటూరు మండలంలో 17, జమ్మలమడుగు మండల పరిధిలో 13, మైలవరం మండల పరిధిలో 13, పెద్దముడియం మండల పరిధిలో 12, కలిపి మొత్తం 55 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. వాటికి గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ.80 వేలు విలువచేసే కియోస్కు యంత్రాలను మంజూరు చేశారు. సాగుదారులు రాయితీపై ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసేందుకు వీలుగా లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాలు రెండేళ్లకే మూలకు చేరాయి. ప్రారంభంలో యంత్రాల ద్వారా అరకొర సేవలు అందినా చాలా కేంద్రాల్లో ఇంటర్నెట్ వసతి అందుబాటులో లేక కియోస్కులు నిరుపయోగంగా నిలిచాయి.

● సేవలన్నీ సెల్‌ఫోన్‌లోనే

ప్రస్తుతం గ్రామస్థాయిలో పనిచేసే వ్యవసాయ సహాయక సిబ్బంది ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, పనిముట్లు, యంత్ర పరికరాలు, ఈ-పంట నమోదు తదితర వివరాలు సెల్‌ఫోన్ ద్వారానే నమోదు చేస్తున్నారు. వాతావరణ సమాచారం. మార్కెట్ ధరలు, తదితర సేవలన్నీ సెల్‌ఫోన్‌లోనే తెలుసుకునేందుకు అవకాశం ఉంది. దీంతో కియోస్కులు మూలకు చేరాయి. కూటమి ప్రభుత్వం యంత్రాల వినియోగంపై అవగాహన కల్పించి వాటిని వినియోగంలోకి తెస్తే మేలని అన్నదాతలు కోరుతున్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చేస్తున్నాం

రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు తదితర వాటిని సెల్‌ఫోన్లలో యాప్‌ల ద్వారా నమోదు చేస్తున్నారు. అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎక్కడి సమస్యలను అక్కడే పరిష్కరించే దిశగా ప్రస్తుతం అన్ని సేవలు సెల్‌ఫోన్‌లోనే వ్యవసాయ సహాయకులు అందిస్తున్నారు. సమస్యలు ఉంటే గుర్తించి పరిష్కరిస్తాం.

\- వరహరి కుమార్, ఏవో ప్రొద్దుటూరు

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



విద్యార్థి షద్రక్

దువ్వూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం చల్లబసాయిపల్లె జడ్పీ హైస్కూలులో 9వ తరగతి చదువుతున్న షద్రక్ అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్షావలి తెలిపారు. దీంతోపాటు స్టార్ ఆఫ్ ది ఆంధ్రాగా గుర్తించబడినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థినిని ఘనంగా సన్మానించారు. పీఈటీ మాస్టర్ సుబ్బరాయుడు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చంద్రకళ, మాజీ సర్పంచ్ లక్ష్మిరెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

కొండాపురం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి చెక్కులను మంగళవారం మండలంలోని చౌటిపల్లె గ్రామంలో పంపిణీ చేశారు. జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి సిఫారసుతో గ్రామంలోని రామాంజులురెడ్డి అనే వ్యక్తికి రూ.40,000, రాజేశ్వరి అనే మహిళకు రూ.18,000, వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను మాజీ సర్పంచ్ రామలింగేశ్వరరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సహకారంతో అమలవుతున్న ' సూర్యఘర్ యోజన పథకాన్ని ' ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శేషఫణి పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను ఆయన మంగళవారం విడుదల చేశారు. రూ.2,23,000లతో సోలార్ విద్యుత్ ఏర్పాటు చేస్తారన్నారు. ఇందులో ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా, బీసీలకు, జనరల్ కేటగిరివారికి రూ.78,000 సబ్సిడీ ఇస్తారన్నారు. దరఖాస్తుదారుడు రూ.23,000 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే ఎల్విన్ కంపెనీ రూ.23,000 భరిస్తారన్నారు. రూ.1,22,000 బ్యాంకులోను ఇప్పిస్తారన్నారు. ఈ సోలార్ ద్వారా నెలకు 450 యూనిట్ల ఉత్పత్తి జరుగుతుందన్నారు. గృహ విద్యుత్ అవసరాలకు వాడుకోగా మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వం వాడుకుని ప్రతి మూడు నెలలకోమారు నేరుగా లబ్ధిదారుని ఖాతాకు జమచేస్తుందన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలు అందరికి అందుబాటులోకి తీసుకురావడానికి సమన్వయంతో టీడీపీ నాయకులు కృషి చేయాలని అక్కరెడ్డిపల్లె సర్పంచు జి.గోపాలమ్మ పిలుపునిచ్చారు. మండలంలోని అక్కరెడ్డిపల్లె గ్రామ పంచాయతీలో టీడీపీ సమన్వయ సమావేశం సర్పంచు ఆధ్వర్యంలోఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పీ4 కార్యక్రమాన్ని పూర్తిచేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బద్వేల్ మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి రితీష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా అందుబాటులోకి తీసుకెళ్లాలని ఆమె కోరారు. పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని కోరారు.

ఎరువుల దుకాణాలు ఆకస్మిక తనిఖీ



ఫర్టిలైజర్స్ షాపులను తనిఖీ చేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

జమ్మలమడుగు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో మంగళవారం జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ముందుగా ముద్దనూరు రోడ్డులోని పెట్రోలు బంకు ఎదురుగా ఎరువుల దుకాణాన్ని ఆయన తనిఖీ చేపట్టి ఎరువులు, మందులు పరిశీలించి రైతులకు ఎంత స్టాకు మందులు, ఎరువులు అమ్మారని రికార్డు తనిఖీ చేశారు. అనంతరం ఆయన ఫర్టిలైజర్స్ దుకాణ యజమానులకు హెచ్చరికలు జారీ చేశారు. రైతులకు అందాల్సిన ఎరువులను బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు జమ్మలమడుగు పట్టణంలో ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ నరేష్‌బాబు, వారి సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు యూరియా కష్టాలు తీర్చాలి

బద్వేలు, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కష్టాలను తీర్చాలని సీపీఐ ఎంఎల్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌లో గల పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆ పార్టీ జిల్లా కమిటీ మెంబర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని లేనిపక్షంలో రైతు సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ మెంటర్ జకరయ్య, ఏరియా కమిటీ సభ్యులు విజయరావు, జయరామరాజు, నారాయణ, చంద్రపాల్ పాల్గొన్నారు.

యూరియాపై ఆందోళనలు వద్దు

ఖాజీపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైతులకు కావాల్సినంత యూరియా అందుబాటులో ఉందని, విజిలెన్స్ సీఐ నారాయణ, డీసీటీవో గీతారాణిలు పేర్కొన్నారు. మంగళవారం రావణపల్లె పంచాయతీలో యూరియా పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో దివిజా సంపతి, వ్యవసాయ శాఖ అధికారులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పంటలు సాగు చేసుకోవాలని యూరియా కొరత లేదని ఎక్కడైనా అక్రమ నిలువలు ఉంటే మా దృష్టికి తేవాలన్నారు. అప్పనపల్లె, చెముళ్లపల్లె, కూనవారిపల్లెలో డీఏపీ రైతు సేవా కేంద్రాల్లో దొరుకుతుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి నాగార్జున, సీఐ వంశీధర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలను పట్టించుకోని అధికారులు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కడప-విజయవాడ ప్రధాన రహదారి ప్రాంతాలలో రోడ్లు గుంతలమయమై ప్రయాణికులు ప్రజలు ఇబ్బంది పడుతుంటే ఆర్అండ్‌బీ అధికారులుపట్టించుకోవడం లేదని సీపీఐ నాయకులు పిడుగు మస్తాన్, కేశవులు ఆరోపించారు. మంగళవారం వారు పాత్రికేయులతో మాట్లాడుతూ మండలంలోని కాల్వకట్ట వద్ద మోకాళ్లలోతు గుంతలు పడి ఇబ్బందికరంగా మారిందన్నారు. అలాగే పోరుమామిళ్ల రోడ్లు కూడా సక్రమంగా వేయడం లేదని వారు పద్ధతి మార్చుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

మొండిబకాయి దారులకు నోటీసులు

బద్వేలుటౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలికంగా పన్నులు చెల్లించకుండా ఉన్న పన్ను బకాయి దారులకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి రెడ్‌నోటీసులు జారీచేస్తున్నామని తెలిపారు. పన్నుబకాయిదారుల నుంచి తప్పనిసరిగా పన్నులు వసూలు చేయాలని సూచించారు. పన్నులను అన్నిసచివాలయాల్లో, పురపాలక కార్యాలయంలో చెల్లించవచ్చని, అలాగే పురమిత్ర, పురసేవా యాప్ ద్వారా, ఆన్‌లైన్ ద్వారా బకాయిలను చెల్లించవచ్చని ఆయన తెలిపారు.

పవన్ ఎంట్రీతోనే రాష్ట్ర రాజకీయాల్లో మార్పు

● డిప్యూటీ సీఎం పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యే వరద



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వరద

ప్రొద్దుటూరు ,సెప్టెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): జన సేన అధినేత పవన్ కళ్యాణ్ ఎంట్రీతోనే 2024 లోరాష్ట్ర రాజకీ యాల్లో పెనుమార్పులు చోటు చేసుకున్నాయని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుక లను ఘనంగా నిర్వహించారు. ఈసందర్బంగా వరదరాజులరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డానికి పవన్ కళ్యాణ్ పాత్ర ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, బలిజసంఘం కార్యదర్శి జయ శంకర్, జనసేన నేతలు పత్తి శివకళ్యాణ్, సుంకరమురళీ, అక్కిదాసరి రామారావు, రామాంజీ ప్రసాద్, మంచి శివకుమార్ ,శ్రీనివాసులు, బాల సుబ్బరాయుడు తదిత రులు పాల్గొన్నారు.

ఘనంగా ఉప ముఖ్యమంత్రి పవన్ జన్మదిన వేడుకలు

● జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్డు, పంపిణీ



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను జనసేన పార్టీ నాయకుడు మాదాసు మురళి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్డు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం మాదాసు మురళి మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేదల పక్షపాతి అని, రాష్ట్రాభివృద్ధికోసం నిరంతరం పరితపిస్తున్నారన్నారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత చదువులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రూపానంద్, డాక్టర్ టీవీ సుదర్శన్‌రెడ్డి, కాపుసంఘం జిల్లా కార్యదర్శి నల్లం చంద్రశేఖర్, వీర మహిళ సంధ్య, పార్టీ సభ్యులు దేవానంద్, కేశవ, బాస్కర్ రెడ్డి, రమణయ్య, మహబూబ్‌బాష పాల్గొన్నారు.

కలసపాడులో: ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం కలసపాడు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. స్థానిక అభయాంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం స్థానిక మూడు రోడ్ల కూడలిలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. . ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఈశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చంద్రహాస్, నవీన్, సురేంద్ర,రమణయ్య, పెద్దయ్యలతో పాటు ఫారెస్టు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పలువురు జనసేన కార్యకర్తలుపాల్గొన్నారు.



పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేస్తున్న జనసేన నాయకులు

మైదుకూరు రూరల్‌లో: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలను సోమవారం జనసేన నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో జనసేన నాయకుడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. రాయల్ కూడలి వద్ద బారీ కేకును కట్ చేసి అందరికి పంచిపెంటారు. కార్యక్రమంలో రామగోవింద్, సుమంత్, కరిడి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దువ్వూరులో: దువ్వూరులో మంగళవారం డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలను జనసేన నాయకులు, టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల నాయకులు రాంబాబు, కోనేటి హరినాథ్, అందె శ్రీనివాసులు, సయ్యద్‌బాష, అభిమానులు పాల్గొన్నారు.



ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న నేతలు

బద్వేలుటౌన్‌లో: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను పురష్కరించుకొని పట్టణంలో మంగళవారం జనసేననాయకులు, బలిజసేవాసంఘం నాయకులు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేసి రక్తదానం చేశారు. అనంతరం అనాథశరణాలయాల్లో, వృద్ధాశ్రమాల్లో పలుచోట్ల అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం అభిమానులు, బలిజసేవాసంఘం నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బలిజ సేవా సంఘం ఉపాధ్యక్షుడు కొర్రపాటి సురేంద్ర, వెంకట సుబ్బయ్య, ప్రతాప్ కుమార్, మస్తాన్‌బాబు, లకిడి విజయ్, నాగార్జున పాల్గొన్నారు.

మాతా శిశుమరణాలను తగ్గించాలి

ఖాజీపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మాతా శిశుమరణాలను తగ్గించాల్సిన బాధ్యత ఆరోగ్య సిబ్బందిపై ఉందని, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు అన్నారు. మంగళవారం ఆశాడే సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో ఆశా, ఎఎన్ఎంలు, పంచాయతీ సిబ్బందికి సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్యాధికారులు ముబీన్, ఇలియారాణి, ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రదానానికి ముందుకు రావాలి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చూపులేనివారికి చూపును ప్రసాదించడానికి నేత్రదానికి ముందుకు రావాలని జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ మాధవీలత పేర్కొన్నారు. మంగళవారం 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురష్కరించుకుని శ్రీనివాసనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యసిబ్బందికి నేత్రదానంపై అవగాహన కల్పించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత మాట్లాడుతూ మరణించిన తర్వాత వారి కళ్లను దానం చేయడం వలన కళ్లులేనివారికి చూపు వచ్చేలా చేయవచ్చునని తెలిపారు. అనంతరం వైద్య సిబ్బందితో నేత్రదానం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అర్బన్ హెల్త్‌సెంటర్ నుంచి రాజీవ్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి రాజీవ్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేసి నేత్రదానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ మోహన్‌కాంత్, డాక్టర్ మధుకుమార్, ఆప్తాల్మిక్ ఆఫీసర్ రవికుమార్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అలగనూరుకు నిధులు మంజూరు చేయండి



మంత్రి నారా లోకేశ్‌కు వినతి ఇస్తున్న ఎమ్మెల్యే పుట్టా

మైదుకూరు రూరల్,సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) : అలగనూరు రిజర్వాయర్ బ్యాలెన్సింగ్ పనులను వెంటనే చేపట్టేందుకు నిధులను మంజూరు చేయాలని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ వినతి పత్రం అందజేశారు. మంగళవారం మంత్రి నారా లోకేశ్ జిల్లా పర్యటనకు విచ్చేసిన సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో, నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనుల గురించి చర్చించారని పుట్టా తెలిపారు. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి మైదుకూరు పర్యటనలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు నిధులను మంజూరు చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. అలగనూరు రిజర్వాయర్ బ్యాలెన్సింగ్ పనులు పూర్తి అయితే, 92 వేల ఎకరాలకు సాగునీరు, అలాగే పలు గ్రామాలకు తాగునీరు కూడా అందుతుందని తెలిపారు. ఈ నీటితో మైదుకూరు నియోజకవర్గంలోని రైతులు రెండుకార్ల పంటలను పండించుకోవచ్చని తెలిపారు.

పుట్టాను కలిసిన సచివాలయం ఉద్యోగులు : ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌ను సచివాలయ ఉద్యోగులు కలిసి కోరారు.ప్రొద్దుటూరులోని పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మైదుకూరు తాలుకా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి నరసింహప్రతాప్‌లు కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో హర్షవర్ధన్‌రాజు, వినీత్, వెంకటయ్య, సతీష్, సురేంద్ర, రాజావలి తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిక్షేత్రం అభివృద్ధికి సహకరించండి



మంత్రి లోకేశ్‌కు కాశినాయన చిత్ర పటం అందజేస్తున్న విజయమ్మ,రితీష్‌రెడ్డి

కాశినాయన సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): కాశినాయన జ్యోతిక్షేత్రం అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్‌కు టీడీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. కడప జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి నారాలోకేశ్‌ను కడప క్యాంపు కార్యాలయంలో మంగళవారం బద్వేల్ టీడీపీ నాయకురాలు మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మ, బద్వేల్ నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త కె.రితీస్‌రెడ్డితో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే కాశినాయన మండల టీడీపీ నాయకుడు బసిరెడ్డి రవీంద్రారెడ్డి, దిన్నెపు క్రిష్టారెడ్డి తదితరులు మంత్రి లోకేశ్‌ను కలిసి కాశినాయన చిత్రపటాన్ని అందజేసి జ్యోతీక్షేత్ర సమస్యలను ఆయనకు వివరించారు. స్పందించిన మంత్రి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి కాశినాయన జ్యోతీక్షేత్ర అభివృద్ధికి కృషిచేస్తానని హామీ ఇచ్చారన్నారు. వారి వెంట టీడీపీ నాయకుడు ఈశ్వర్‌రెడ్డి ఇతర నాయకులు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన పలువురు నేతలు



లోకేశ్‌కు ఆయన చిత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, భూపేష్‌రెడ్డి

జమ్మలమడుగు/చాపాడు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు విచ్చే సిన రాష్ట్ర విద్యా, ఐటీ శాఖామంత్రి నారా లోకేశ్‌ను పలువురు టీడీపీ నేతలు కలిశారు. ఇందులో భాగంగా జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి మంత్రివర్యులు నారా లోకేష్‌ను కలిశారు. భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ కమలాపురం పర్యటన సందర్భంగా కడపలో విమానాశ్రయంలో కలిసి జమ్మలమడుగు ప్రాంత పలు సమస్యలపై మాట్లాడినట్లు తెలిపారు. అలాగే మంత్రి నారా లోకేశ్ ను అల్లాడుపల్లె రైతు సేవా సహకార సొసైటీ చైర్మన్ మార్తల నరసింహారెడ్డి మంగళవారం కడపలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తనకు చైర్మన్ పదవి ఇచ్చినందుకు లోకేష్‌కు, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.కాగా రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పిచ్చపాటి మునిశేఖర్‌రెడ్డి మంగళవారం కడపలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులు సంతృప్తిగా ఉన్నాయని మంత్రికి చెప్పారు.

మంత్రిని కలిసిన డీసీసీ బ్యాంకు చైర్మన్



మంత్రి లోకేశ్‌తో డీసీసీబీ చైర్మన్

బద్వేలుటౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లా పర్యాటనలో భాగంగా కమలాపురం నియోజకవర్గంలో వివిధ అభివృద్ధికార్యక్రమాల ప్రారంభోత్సవాలకు వచ్చిన రాష్ట్ర విద్య, ఐటీశాఖామంత్రి నారా లోకేశ్‌ను డీసీసీ బ్యాంకు చైర్మన్ సూర్యనారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలసి ఘనస్వాగతం పలికారు. అనంతరం జిల్లా సమస్యలపై వారు చర్చించుకున్నారు. వారితోపాటు ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్ అరవ శ్రీనివాసులరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పన్ను బకాయిలను వెంటనే పూర్తిచేయాలి

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నుల వసూళ్లలో జిల్లాలోని మున్సిపా లిటీ లకంటే వెనుకబడి ఉన్నామని ఇచ్చిన లక్ష్యాలను పూర్తిచేయాలని మున్సిపల్ కమి షనర్ రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్లో 46 సచివాలయ కార్యదర్శులతో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి సచివాలయ కార్యదర్శికి మీ వార్డు పరిధిలో ఉన్న పన్ను బకాయిలపై టార్గెట్ ఇస్తామని దాన్ని పూర్తి చేయలని ఆయన సూచించారు. నీటి పన్ను కట్టని వారికొళాయిలకు నీటి సరఫరా బంద్ చేయాలన్నారు. ట్రేడ్ లైసెన్సు డిమాండ్‌ను భారీగా పెంచాల్సి ఉందని పట్టణంలో అనేక ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు ఉన్నాయని వాటన్నింటికి వీఎల్‌టి పన్ను విధించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ కొండయ్య, మున్సిపల్ ఈఈ శ్రీనివాసులు, టీపీవో చంద్రమోహన్, ఆర్‌వో డేనియల్ జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలి

మైలవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేసిన ప్రతిరైతు ఈ-క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి గురుభాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని తలమంచిపట్నం పంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించి పంటల పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మొక్కజొన్న, కంది, మినుము, పత్తి, మిరప ఏ పంట అయినా పొలాల్లో సాగు చేస్తే వ్యవసాయాధికారులకు పూర్తి వివరాలతో సమాచారం అందిస్తే మీ పొలం వద్దకే వచ్చి మాట్లాడి అక్కడే పంట నమోదు చేస్తారన్నారు. కార్యక్రమంలో వీఏఏ యోన, రైతులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్డు, పంపిణీ

పోరుమామిళ్ల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని రోగులకు బ్రెడ్డు, పండ్లు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పంపిణీ చేశారు. మంగళవారం పోరుమామిళ్ల రెడ్డినగర్‌లో ఉన్న వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రంగసముద్రం సర్పంచు చిత్త రవిప్రకాష్‌రెడ్డి, బద్వేల్ మాజీ మున్సిపల్ చైర్మన్ మునెయ్య, నాయకులు పాల్గొన్నారు. అలాగే బద్వేల్ వైసీపీ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జమ్మలమడుగులో: జమ్మలమడుగు నారాపురం వెంకటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా మంగళవారం ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గజ్జెల లక్షుమయ్య, ముల్లా జానీ, దన్నవాడ మహేశ్వరరెడ్డి, పట్టణాధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కలసపాడు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కీటక జనిత వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి నరసింహారెడ్డి, వైద్యాధికారి డాక్టర్ శైలజ, డాక్టర్ సాయితేజలు కోరారు. మంగళవారం కలసపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. లార్వాలను అదుపుచేసి చేసినపుడే దోమలను నియంత్రించగలమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గంగయ్య, సీహెచ్ఓ వెంకటసుబ్బమ్మ, హెల్త్ అసిస్టెంట్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.